www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 04 సంచిక : 97 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com శుక్రవారం 24 - 07 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Guntur,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



పేద విద్యార్థిని చదువుకు మంత్రి కోమటిరెడ్డి రూ.10 లక్షల సాయం



## తిరుమలను రాజకీయం చేయొద్దు

- వైసీపీపై భాను ప్రకాశ్ రెడ్డి ధ్వజం
- సనాతన ధర్మాన్ని రాజకీయ లబ్ధికి వాడుకోవద్దన్న భానుప్రకాశ్ రెడ్డి
- వైసీపీ హయాంలో ఎన్నో ఆలయాలపై దాడులు జరిగాయని మండిపాటు
- ఏ అంశంపై అయినా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్

**అమరావతి :** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలను రాజకీయావసరాలకు వేదికగా మార్చవద్దని టీటీడీ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. సనాతన ధర్మాన్ని, ఆలయ వ్యవహారాలను తమ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవద్దని వైసీపీ - మిగతా 2 లో

# భూ మోసాలకు 'బ్లాక్‌చెయిన్'తో చెక్

- ట్యాంపర్ ప్రూఫ్ విధానానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- భూ రికార్డుల భద్రత కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వినియోగం
- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా 'మీ భూమి-బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం
- మొదటి దశలో 7 జిల్లాల్లోని 7 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమన్న సీఎం
- నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సన్నాహాలు



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో భూ రికార్డుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచి, మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రూపొందించిన 'మీ భూమి-బ్లాక్‌చెయిన్' పైలట్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించడమే లక్ష్యంగా రెవెన్యూ శాఖ ఈ అత్యాధునిక టెక్నాలజీకి రూపకల్పన చేసింది. ఈ విధానం ద్వారా డబుల్ రిజిస్ట్రేషన్ల వంటి సమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, సరైన రికార్డులు లేకపోవడం వల్లే - మిగతా 2 లో

## పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలి



- ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- మంత్రుల బృందం తొలి సమావేశంలో లోకేశ్
- నారా లోకేశ్ అధ్యక్షతన మంత్రుల బృందం తొలి సమావేశం
- రాష్ట్రానికి రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు
- దీని ద్వారా 24.66 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో భారీగా పెట్టుబడులు రానున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటయ్యేందుకు ముందుకు వచ్చాయని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 24.66 లక్షల మంది యువతకు - మిగతా 2 లో

## దేశ యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం



- కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- యువత భవిష్యత్తు మోదీ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమంటూ అమిత్ షా వ్యాఖ్యలు
- నీట్ అంశంపై కమల్ హాసన్, రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రేలు కూడా కేంద్రంపై విమర్శలు

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ ఆరోపణలు రాజకీయంగా వేడెక్కుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పేపర్ లీక్ కేసుల్లో నిందితులకు వేగంగా శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ నిర్ణయానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా మద్దతు తెలుపుతూ ఇది యువత సంక్షేమం, వారి ఉజ్వల భవిష్యత్తుపై మోదీ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.గురువారం సోషల్ మీడియా వేదికగా స్పందించిన అమిత్ షా, "యువత సంక్షేమం, వారి ఉజ్వల భవిష్యత్తు మోదీ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు. పేపర్ లీక్ కేసుల్లో దోషులపై వేగంగా విచారణ జరిపి, కఠిన - మిగతా 2 లో

## వర్షాలు, వరదలతో అసోం విలవిల

- 41కి చేరిన మృతుల సంఖ్య
- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉగ్రరూపం దాల్చిన నదులు
- తీవ్రంగా ప్రభావితమైన 6.53 లక్షల మంది ప్రజలు
- ముంపుకు గురైన 939 గ్రామాలు



**ఢిల్లీ :** అసోంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర వినాశనాన్ని సృష్టిస్తున్నాయి. నదులన్నీ ఉగ్రరూపం దాల్చి ప్రమాద హెచ్చరిక స్థాయిలను దాటి ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలో వరద పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వేలాది మంది ఇళ్లను వదిలి దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయారు. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం... గడిచిన 24 గంటల్లోనే నలుగురు చిన్నారులతో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో వరదల కారణంగా సంభవించిన మొత్తం మరణాల సంఖ్య 41కి చేరుకుంది.తాజా - మిగతా 2 లో

## ఆగని సైబరాసురుల ఆగడాలు




- 146 శాతం పెరిగిన ఎస్సెమ్మెస్‌ల స్కామ్‌లు
- 67 శాతం పెరిగిన మొబైల్ మోసాలు
- 8.5 లక్షల మ్యూల్ అకౌంట్లు గుర్తింపు
- రూ.22,496 కోట్ల సైబర్ ఫిర్యాదులు
- రూ.9,055 కోట్ల మోసాలు అడ్డుకట్ట

## భూమికి దూరంగా జరుగుతున్న చంద్రుడు

- శాస్త్రవేత్తల అధ్యయనంలో ఆసక్తికర విషయాలు!
- ఏడాదికి 3.83 సెం.మీ. దూరమవుతున్న చంద్రుడు
- లేజర్ పరీక్షలతో మార్పును గుర్తిస్తున్న శాస్త్రవేత్తలు
- భూ భ్రమణమే దీనికి ప్రధాన కారణం
- రోజు వ్యవధి క్రమంగా పెరిగే అవకాశం
- శతాబ్దానికి 1-2 మిల్లీసెకన్లు పెరుగుతున్న ఒక రోజు నిడివి
- భవిష్యత్‌లో ఆటుపోట్లు బలహీనపడే అవకాశం

**ఢిల్లీ :** భూమికి చంద్రుడు ప్రతి ఏడాది సుమారు 3.83 సెంటీమీటర్ల వేగంతో దూరమవుతున్నాడని శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఇది మనిషి గోర్లు పెరిగే వేగంతో సమానమే అయినప్పటికీ, కోట్లాది సంవత్సరాల వ్యవధిలో భూమిపై గణనీయమైన మార్పులకు దారితీసే అవకాశం ఉందని - మిగతా 2 లో





## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్
- గ్లోబరీనా టెక్నాలజీస్‌పై చేసిన ఆరోపణలపై వివాదం
- 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరిక

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు.ముఖ్యమంత్రి చేసిన - మిగతా 2 లో

## ఎల్‌నినో ఎఫెక్ట్ ప్రతి వర్షపు నీటి చుక్కనూ కాపాడుకుందాం



- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్‌నినో కారణంగా తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం
- అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఆరుతడి పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచన

**హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా - మిగతా 2 లో

# ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్
- తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ



**హైదరాబాద్ :** తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు.హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని - మిగతా 2 లో

# సంపాదకీయం

## డ్రగ్స్ రహిత భారత్ కోసం కృషి జరగాలి

భారతదేశ యువశక్తి ప్రపంచంలోనే అతిపెద్ద సంపదగా గుర్తింపు పొందుతోంది. అయితే ఈ అమూల్యమైన శక్తికి మాదకద్రవ్యాల వ్యసనం తీవ్రమైన ముప్పుగా మారుతోంది. డ్రగ్స్ కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్నే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని, దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయి. అందుకే "డ్రగ్స్ రహిత భారత్" అనేది ప్రభుత్వ లక్ష్యం మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యతగా మారాలి. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మాదకద్రవ్య వినియోగ సర్వే ప్రకారం దేశంలో సుమారు 2.9 కోట్ల మంది పెద్దలు గంజాయిని, 1.9 కోట్ల మంది ఒపియాయిడ్ మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు అంచనా. అలాగే 10--17 సంవత్సరాల వయస్సు గల సుమారు 40 లక్షల మంది పిల్లలు ఒపియాయిడ్ వినియోగానికి గురవుతున్నట్లు నివేదిక పేర్కొంది. ఇవి సమస్య తీవ్రతను తెలియజేసే ఆందోళనకర గణాంకాలు. ఇటీవలి సంవత్సరాల్లో మరో ప్రమాదకర ధోరణి వెలుగుచూసింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ప్రకారం 2019తో పోలిస్తే సింథటిక్ డ్రగ్స్ అక్రమ రవాణా దాదాపు ఆరు రెట్లు పెరిగింది. అంతర్జాతీయ ముఠాలు, డార్క్‌నెట్, సామాజిక మాధ్యమాల ద్వారా యువతను లక్ష్యంగా చేసుకొని మాదకద్రవ్యాల వ్యాపారం విస్తరిస్తోంది. డ్రగ్స్ బారిన పడుతున్న వారిలో అధికశాతం యువతే ఉండటం మరింత ఆందోళన కలిగించే విషయం. విద్యార్థులు, ఉద్యోగాల్లోకి కొత్తగా అడుగుపెడుతున్న యువకులు, ఒత్తిడి, స్నేహితుల ప్రభావం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ, సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలకు ఆకర్షితులై ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఒకసారి వ్యసనానికి బానిసైతే విద్య, ఉపాధి, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు తీవ్రంగా దెబ్బతింటాయి. డ్రగ్స్ నిర్మూలనలో కేవలం పోలీసు చర్యలు మాత్రమే సరిపోవు. కుటుంబాలు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. యువతలో క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా కాకుండా వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావడం కూడా అంతే ముఖ్యమైనది. అమెరికా, సింగపూర్, జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన దేశాలు మాదకద్రవ్యాల నియంత్రణలో జీరో టాలరెన్స్ పాలసీ, ఇంటెలిజెన్స్ ఆధారిత ఎన్‌ఫోర్స్‌మెంట్, బోర్డర్ సర్వైలెన్స్, డిజిటల్ ట్రాకింగ్, స్కూల్ స్థాయి అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ వంటి బహుముఖ వ్యూహాలను అమలు చేస్తున్నాయి. సింగపూర్‌లో డ్రగ్స్ అక్రమ రవాణాపై అత్యంత కఠిన చట్టాలు అమల్లో ఉండగా, జపాన్‌లో పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్ వ్యతిరేక విద్యను తప్పనిసరి చేశారు. అమెరికాలో డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా అంతర్జాతీయ ముఠాలపై సమన్వయ చర్యలు చేపడుతుండటంతో పాటు, వ్యసనానికి గురైన వారికి రీహాబిలిటేషన్ మరియు కౌన్సెలింగ్ సేవలను విస్తృతంగా అందిస్తోంది. ఆస్ట్రేలియా హార్మ్ రిడక్షన్, ఎర్లీ ఇంటర్వెన్షన్, కమ్యూనిటీ పార్టిసిపేషన్కు ప్రాధాన్యం ఇస్తూ యువతలో అవగాహన పెంచుతోంది. ఈ దేశాల అనుభవం చెబుతున్నది ఒక్కటే----కఠిన చట్టాలు, ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన నిఘా, ప్రజల్లో నిరంతర అవగాహన, వ్యసన బాధితులకు పునరావాసం అనే ఐదు అంశాలు కలిసినప్పుడే డ్రగ్స్ నిర్మూలనలో స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయి. భారత ప్రభుత్వం నషా ముక్త భ్రాత్ అభియాన్ , నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల విద్యాసంస్థల్లో యువతను భాగస్వామ్యం చేస్తూ దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. డ్రగ్స్‌పై పోరాటం ఒక ఉద్యమంగా మారినప్పుడే విజయం సాధ్యమవుతుంది. "ఒక కుటుంబం -- ఒక సంకల్పం, ఒక విద్యాసంస్థ -- ఒక అవగాహన కార్యక్రమం, ఒక గ్రామం -- ఒక డ్రగ్స్ నిరోధక కమిటీ" అనే దిశగా ముందుకు సాగితేనే ఫలితాలు కనిపిస్తాయి. ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కార్యకలాపాలను అధికారులకు తెలియజేయాలి. డ్రగ్స్ రహిత భారత్ అంటే ఆరోగ్యవంతమైన యువత, సురక్షిత కుటుంబాలు, శక్తివంతమైన సమాజం, అభివృద్ధి చెందిన దేశం. ఈ లక్ష్యాన్ని సాధించడం ప్రతి భారతీయుడి సామాజిక బాధ్యత.

హెచ్.ప్రతాప్

# భూ మోసాలకు 'బ్లాక్‌చెయిన్'తో చెక్

మొదటిపేజీ తరువాయి - విలువైన భూముల విషయంలో మోసాలు, వివాదాలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో భూ తగాదాలు పెరిగాయని, 22ఏ నిబంధనను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. తమ ప్రభుత్వం 'ప్రక్షాళన, విముక్తి, భద్రత' అనే మూడు సూత్రాల ఆధారంగా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా నలుగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రారంభించిన బ్లాక్‌చెయిన్ వ్యవస్థ ద్వారా భూములకు ట్యాంపర్ ప్రూఫ్ భద్రత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును ఎన్ఐసీ ఆంధ్రప్రదేశ్, బెంగళూరులోని ఎన్ఐసీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా 'హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్' టెక్నాలజీతో అభివృద్ధి చేశాయి. ఈ విధానంలో ప్రతి భూ కమతానికి ఒక ప్రత్యేక డిజిటల్ ఐడీని కేటాయించి, లావాదేవీలను అత్యంత భద్రంగా నమోదు చేస్తారు. దీనివల్ల రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు ఒకే వేదికపైకి వచ్చి, భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్' వ్యవస్థ ఏర్పడుతుంది. దీంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టు కింద తొలి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలాన్ని ఎంపిక చేశారు. ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లోని 89 రీ-సర్వే గ్రామాల్లో ఉన్న 1,37,763 ల్యాండ్ పార్సెల్స్ ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. ఈ పైలట్ ప్రాజెక్టు అమలును రెండు నెలల పాటు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదుల కోసం ఒక ప్రత్యేక కంప్లైంట్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా వ్యవస్థలో మార్పులు చేసి, నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.



# పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి - ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం తొలి సమావేశం ఉండవల్లిలో మంత్రి లోకేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రతి ప్రాజెక్టును నిరంతరం ట్రాక్ చేస్తూ, అవి త్వరితగతిన కార్యరూపం దాల్చేలా (గ్రౌండింగ్) చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలకు భూ కేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షా సమావేశంలో కచ్చితమైన పురోగతి కనిపించాలని దిశానిర్దేశం చేశారు. నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ ద్వారా మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి తరలివచ్చే అవకాశం ఉందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చే పరిశ్రమలకు పునరుత్పాదక ఇంధన అవసరాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ)పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇవి ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని మంత్రి అన్నారు. నిర్ణీత సమయంలో పరిశ్రమలను ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేందుకు పూర్తిస్థాయి ఆటోమేటిక్ వ్యవస్థను తీసుకురావాలని ఆదేశించారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించినట్లు అధికారులు ఈ సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# దేశ యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం

మొదటిపేజీ తరువాయి - చర్యలు తీసుకునేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న ప్రధాన మంత్రి నిర్ణయం ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తోంది" అని పేర్కొన్నారు. అంతేకాకుండా, పేపర్ లీక్‌ల ద్వారా యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే వారిపై తీసుకుంటున్న ఈ చర్య దేశంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అమిత్ షా అభిప్రాయపడ్డారు. పోటీ పరీక్షలపై యువత నమ్మకాన్ని నిలబెట్టడం, పరీక్షా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన వ్యాఖ్యల సారాంశం. ఇదే అంశంపై బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ కూడా కీలక ప్రకటన చేశారు. "దేశ యువత సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి వేగవంతమైన, కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. యువత భవిష్యత్తును దెబ్బతీయాలని చూసే ఎవరినీ వదిలిపెట్టం" అని ప్రధాని స్పష్టం చేశారు. కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నిరసనలే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. నీట్-యూజీ పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. పలు రాష్ట్రాల్లో విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతుండగా, ఈ అంశం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కూడా ప్రభావితం చేస్తోంది. విపక్షాలు నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపాలని పట్టుబ డుతున్నాయి. దీంతో లోక్‌సభలో పలుమార్లు అంతరాయాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు సౌగత రాయ్, మహువా మొయిత్రాలు గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి చర్చించారు. ంఅంతకుముందు ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన స్పీకర్ ఓం బిర్లా, ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని, సభా నియమావళి ప్రకారం ఏ విధంగా చర్చ నిర్వహించాలను కుంటున్నారో విపక్షాలు సూచించాలని తెలిపారు. అయితే, వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పేపర్ లీక్ అంశంతో పాటు విద్యార్థులపై పోలీసుల చర్యలు, అయోధ్య రామాలయానికి సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో సభా కార్యకలాపాలు తరచూ నిలిచిపోతున్నాయి. ఇక బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ కూడా ప్రధాని నిర్ణయాన్ని సమర్థించారు. యువత భవిష్యత్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. పార్లమెంట్‌లో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ, విపక్షాలు అనవసర రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు.



# భూమికి దూరంగా జరుగుతున్న చంద్రుడు

మొదటిపేజీ తరువాయి - హెచ్చరిస్తున్నారు. అపోలో వ్యోమగాములు 1969-71 మధ్య చంద్రుడిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక లేజర్ రిఫ్లెక్టర్ల సాయంతో గత ఐదు దశాబ్దాలుగా ఈ దూరాన్ని అత్యంత కచ్చితత్వంతో కొలుస్తున్నారు. భూమి నుంచి పంపిన లేజర్ కిరణాలు తిరిగి రావడానికి పట్టే సమయాన్ని లెక్కించి చంద్రుడి కక్ష్యలో వస్తున్న మార్పులను గుర్తిస్తున్నారు. శాస్త్రవేత్తల ప్రకారం దీనికి ప్రధాన కారణం భూభ్రమణం, చంద్రుడి గురుత్వాకర్షణ, సముద్ర అలల ప్రభావం (టైడల్ ఫ్రిక్షన్). భూమి తన అక్షంపై వేగంగా తిరగడం వల్ల చంద్రుడికి కొద్దికొద్దిగా అదనపు శక్తి చేరి, అది క్రమంగా మరింత ఎత్తైన కక్ష్యలోకి వెళ్లిపోతోంది. అదే సమయంలో భూభ్రమణ వేగం స్వల్పంగా తగ్గుతోంది. ఈ ప్రక్రియ ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో భూమిపై పలు మార్పులు కనిపించనున్నాయి. రోజు నిడివి క్రమంగా పెరుగుతుంది. ప్రస్తుతం ప్రతి శతాబ్దానికి ఒకటి నుంచి రెండు మిల్లీ సెకన్ల మేర రోజు పొడవు పెరుగుతోందని పరిశోధకులు చెబుతున్నారు. దాదాపు 100 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజు కేవలం 19 గంటలే ఉండేదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మరో కీలక మార్పు సంపూర్ణ సూర్యగ్రహణాలు అంతరించిపోవడం. ప్రస్తుతం చంద్రుడు, సూర్యుడు భూమి నుంచి దాదాపు ఒకే పరిమాణంలో కనిపించడం వల్లే సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతోంది. కానీ చంద్రుడు మరింత దూరమైతే దాని పరిమాణం చిన్నగా కనిపిస్తుంది. దీంతో సుమారు మరో 60 కోట్ల సంవత్సరాల తర్వాత భూమిపై సంపూర్ణ సూర్యగ్రహణాలు కనిపించవని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అలాగే చంద్రుడి గురుత్వాకర్షణ ప్రభావం తగ్గడంతో సముద్ర అలల తీవ్రత కూడా క్రమంగా తగ్గే అవకాశం ఉంది. ఇది తీరప్రాంత జీవవ్యవస్థలు, సముద్ర జీవుల పునరుత్పత్తి చక్రాలు, మత్స్య సంపదపై దీర్ఘకాలంలో ప్రభావం చూపే అవకాశముందని పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే ఈ మార్పులన్నీ లక్షల, కోట్ల సంవత్సరాల కాలంలో చోటుచేసుకుంటాయని, ప్రస్తుతం మనుషులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం చంద్రుడు దూరమవుతున్న ప్రక్రియ అత్యంత నెమ్మదిగా కొనసాగుతోందని తెలిపారు.

# వర్షాలు, వరదలతో అసోం విలవిల

మొదటిపేజీ తరువాయి - మరణాల్లో శివసాగర్ జిల్లాలో ముగ్గురు, జోర్హాట్‌లో ముగ్గురు, చరైడియో జిల్లాలో ఇద్దరు, ధేమాజీ, కర్బీ అంగ్లాంగ్ జిల్లాల్లో ఒకరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు మరో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం ఆరుగురు వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లోని 40 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని దాదాపు 939 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. మొత్తం 6.53 లక్షలకు పైగా ప్రజలు ఈ వరదల దాటికి తీవ్రంగా ప్రభావితమయ్యారు. బ్రహ్మపుత్ర నదితో పాటు దాని ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. నంగ్లామురాఘాట్ వద్ద 'దిసాంగ్' నది తన ఆల్-టైమ్ రికార్డు స్థాయి ప్రమాదకర మట్టాన్ని దాటి ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అలాగే బుర్హిదిహింగ్, దిఖౌ, ధన్సిరి, కుషియారా నదులు కూడా ప్రమాదకర హెచ్చరిక స్థాయిలను దాటి దిగువ ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. బాధిత జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 487 రిలీఫ్ క్యాంపులు, పంపిణీ కేంద్రాలలో దాదాపు 3.13 లక్షల మంది ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు 1.38 లక్షలకు పైగా మూగజీవాలు కూడా ఈ వరదల వల్ల ప్రభావితమయ్యాయి. ఇండియన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వాయుసేన, ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ బృందాలు రంగంలోకి దిగి ఒక్కరోజే 8,400 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. వరద ధాటికి 53 రోడ్లు, 6 కట్టలు పూర్తిగా ధ్వంసమై రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది.



# ఆగని సైబరాసురుల ఆగడాలు

మొదటిపేజీ తరువాయి - దేశంలో ఎస్సెమ్మెస్‌ల ద్వారా జరిగే సైబర్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే 2026 తొలి అర్ధభాగంలో ఎస్సెమ్మెస్‌ల ఆధారిత మోసాలు 146 శాతం పెరిగినట్లు 'బయోక్యాచ్' నివేదిక వెల్లడించింది. ఇదే కాలంలో మొబైల్ ఫ్రాడ్ సెషన్లు 67 శాతం పెరిగినట్లు పేర్కొంది. నివేదిక ప్రకారం ఐఓఎస్ పరికరాల్లో మొబైల్ మోసాలు 86 శాతం, ఆండ్రాయిడ్‌లో 35 శాతం పెరిగాయి. మరోవైపు వెబ్ బ్రౌజర్ల ద్వారా జరిగే మోసాలు మాత్రం 10 శాతం తగ్గాయి. దీంతో సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్లనే ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. మోసాల విలువ కూడా పెరుగుతోందని నివేదిక తెలిపింది. అనుమానాస్పద చెల్లింపులు రెట్టింపు కాగా, ఒక్కో మోసంలో బదిలీ అవుతున్న సగటు మొత్తం 1.7 రెట్లు పెరిగింది. అదే సమయంలో నేరగాళ్లు మరింత వేగంగా డబ్బులు కాజేస్తున్నారని, మోసపూరిత కాల్స్ సెషన్ల వ్యవధి తగ్గడమే అందుకు నిదర్శనమని విశ్లేషించింది. 2025లో దేశవ్యాప్తంగా వివిధ బ్యాంకుల 700కు పైగా శాఖల్లో 8.5 లక్షలకుపైగా 'మ్యూల్ అకౌంట్లు' గుర్తించినట్లు నివేదిక వెల్లడించింది. అలాగే సైబర్ మోసాలకు సంబంధించి రూ.22,496 కోట్ల విలువైన ఫిర్యాదులు నమోదయ్యాయని, 26.48 లక్షల మ్యూల్ అకౌంట్ కేసులు వెలుగులోకి వచ్చాయని తెలిపింది. అనుమానితుల రిజిస్ట్రీ ద్వారా రూ.9,055 కోట్ల మోసాలను అడ్డుకున్నట్లు పేర్కొంది. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆన్‌లైన్ పెట్టుబడుల వినియోగం వేగంగా పెరగడంతో భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారిందని నివేదిక పేర్కొంది. అయితే బ్యాంకులు, ఆర్‌బీఐ, ఐ4సీ, చట్టాన్ని అమలు చేసే సంస్థలు కలిసి పనిచేయడం వల్ల మోసాలను ముందుగానే గుర్తించే సామర్థ్యం మెరుగుపడుతోందని 'బయోక్యాచ్' వెల్లడించింది.



# తిరుమలను రాజకీయం చేయొద్దు

మొదటిపేజీ తరువాయి - నేతలకు గట్టి హితవు పలికారు. ఢిల్లీ వేదికగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరుమల ఘాట్ రోడ్డులో చోరీకి గురైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని పోలీసులు 24 గంటల్లోనే రికవరీ చేశారని, వెంటనే దాన్ని పునఃప్రతిష్ఠించామని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో దేవాలయాలపై దాడులు జరిగాయని భానుప్రకాశ్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కానీ, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేవాలయాల పరిపాలన అత్యంత పారదర్శకంగా, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా సాగుతోందని వెల్లడించారు. తిరుమల టీటీడీ నిధుల మళ్లింపుపై ప్రశ్నిస్తూ, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడేముందు తగిన ఆధారాలతో మాట్లాడాలని సవాల్ విసిరారు. ఆలయ పాలన లేదా మరే ఇతర అంశంపై అయినా తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని భానుప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమే ధ్యేయంగా అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని ఆయన ఈ సందర్భంగా వైసీపీ నాయకులకు హితవు పలికారు.

# ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు

మొదటిపేజీ తరువాయి - విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్ ప్రతి వర్షపు నీటి చుక్కనూ కాపాడుకుందాం

మొదటిపేజీ తరువాయి - హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు



మొదటిపేజీ తరువాయి - వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.

www.akshratimes.com

తెలుగు దినపత్రిక

అక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

## సమయానికి మించి షాపు తెరిస్తే.. ట్రాఫిక్ డ్యూటీయే శిక్ష.!

### రూ.250 జరిమానా.. ట్రాఫిక్ విధుల్లో గంటపాటు సేవలు



**చర్లపల్లి,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు):** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వేళ నిర్ణయించిన సమయాన్ని దాటి దుకాణాన్ని నిర్వహించిన ఓ వ్యాపారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యాపార సంస్థను కొనసాగిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు సంబంధిత వ్యక్తిపై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి కుషాయిగూడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన గౌరవ న్యాయమూర్తి నిబంధనల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తూ సంబంధిత వ్యక్తికి రూ. 250 జరిమానా విధించారు. అంతేకాకుండా శిక్షలో భాగంగా గంటపాటు ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో పోలీసు సిబ్బందికి సహకరిస్తూ సామాజిక సేవ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు చర్లపల్లి పోలీసులు గురువారం సంబంధిత వ్యక్తితో ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో గంటపాటు సేవలు చేయించి శిక్షను అమలు చేశారు. ఈ సందర్భంగా రహదారిపై వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంలో పోలీసులకు సహకరిస్తూ విధులు నిర్వహించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని శ్రీరామ రెస్టారెంట్ నిర్వాహకుడు భరత్ (24) నిర్ణయించిన సమయాన్ని దాటి వ్యాపారం కొనసాగించడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు వ్యాపారులకు హెచ్చరిక జారీ చేస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లోనే దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలను నిర్వహించాలని సూచించారు. రాత్రి వేళల్లో నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామని స్పష్టం చేశారు. ప్రజా శాంతి భద్రతల పరిరక్షణ, రాత్రివేళల్లో నిబంధనల అమలులో ఎలాంటి రాజీ ఉండదని, ప్రతి వ్యాపారి చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు పాటించడం ద్వారా అనవసరమైన చట్టపరమైన ఇబ్బందులు, జరిమానాలు, సామాజిక సేవా శిక్షలను నివారించవచ్చని సూచించారు.

## అంకగణిత పోటీల్లో ఆల్కాపూర్ టౌన్‌షిప్ విద్యార్థుల ప్రతిభ.

### పలువురికి తొలి మూడు స్థానాలు




**కాప్రా,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** ప్రాంతీయ స్థాయి అంకగణిత ప్రతిభా పోటీల్లో ఆల్కాపూర్ టౌన్‌షిప్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో తొలి, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు ప్రోత్సాహక స్థానాలను సొంతం చేసుకుని తమ విద్యాసంస్థకు మంచి పేరు తీసుకొచ్చారు. ఈ ప్రాంతీయ అంకగణిత ప్రతిభా పోటీలు జూలై 12న శంషాబాద్‌లోని కన్వెన్షన్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణతో పాటు పలు ప్రాంతాల నుంచి సుమారు 3,300 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కఠినమైన పోటీని ఎదుర్కొంటూ ఆల్కాపూర్ టౌన్‌షిప్ కేంద్రానికి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో తొలి, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు ప్రోత్సాహక స్థానాలను ౕక్కించుకున్నారు. విద్యార్థుల ఈ విజయాన్ని పురస్కరించుకుని ఆల్కాపూర్ టౌన్‌షిప్ కేంద్రంలో ప్రత్యేకంగా విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కూడా ఘనంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర నిర్వాహకులు శ్రవణ్, శ్రీనిక మాట్లాడుతూ, విద్యార్థుల విజయం వారి కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని విద్యార్థులకు ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ విజయోత్సవంలో పాల్గొని విజేతలను అభినందించారు. విద్యార్థుల విజయంతో ఆల్కాపూర్ టౌన్‌షిప్ కేంద్రంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

## ఓటరు జాబితా సవరణపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి ఆదర్శ్ రెడ్డి పిలుపు





**పటాన్‌చెరు,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.వీరేష్)** పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్ఐఆర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన 30 ప్రచార ఆటోలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆగస్టు 3వ తేదీ ఎస్ఐఆర్ ప్రక్రియకు చివరి తేదీ అని గుర్తు చేస్తూ, ప్రజలు తమ ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్‌కు వెంటనే అందజేయాలని కోరారు. అలాగే మిగిలిన పది రోజులు బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి ప్రతి ఓటరికి అవగాహన కల్పించి, ఒక్క ఓటు కూడా కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శశిధర్ రెడ్డి: సమస్యల పరిష్కారానికే నా మొదటి ప్రాధాన్యత



**అమీన్పూర్,జులై 23 .అక్షర టైమ్స్ :(ప్రతినిధులు వీరేష్)** బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తానని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి స్పష్టం బఱచేశారు. నల్లూరి హైట్స్ కాలనీలో తన సొంత నిధులతో రెండు వందల పది మీటర్ల సిమెంట్ రహదారి నిర్మాణాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ పడేది లేదని తెలిపారు. కాలనీల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. బీరంగూడ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ చేపడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు చుక్క రెడ్డి, నరేందర్ రెడ్డి, రామ్ చేంద్ర రెడ్డి, మురళి, వెంకట్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వాంపుగూడలో ఓటరు జాబితా సవరణపై అవగాహన

### ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి: పరమేశ్వర్ రెడ్డి

**కాప్రా,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైందని, అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముందుముల పరమేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. వాంపుగూడ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సాయిబాబా నగర్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక బూత్ స్థాయి అధికారులతో కలిసి ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమం నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం వాంపుగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి అనుప్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు విలువను వివరించిన పరమేశ్వర్ రెడ్డి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నమోదైన ఓటర్లు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకొని, పేరు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు అవసరమైతే సంబంధిత దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఓటు కీలకమని పేర్కొన్న ఆయన, ఎన్నికల



ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవసరమైన దరఖాస్తు పత్రాలను పంపిణీ చేసి, వాటిని ఎలా నింపాలనే విషయంపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ అసెంబ్లీ సమన్వయకర్త వరలక్ష్మి, మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, సమన్వయకర్త సీతారాంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కావలి అనుప్ రాజ్ యాదవ్,మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ




ఉపాధ్యక్షుడు విట్టల్ నాయక్, జిల్లా కార్యదర్శులు అడుపు శ్రీనివాస్, మారుతి, మాజీ డివిజన్ అధ్యక్షుడు కోబారి నాగసాషు, రాజేందర్, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, రాజు, షబుద్దీన్, రాకేష్ యాదవ్, నాగరాజు, ముర్తజా, జగదీష్, జగదీష్ గౌడ్, మచ్చ శ్రీకాంత్ గౌడ్, సోమనాథ్, చోటు భాయ్, మల్లారెడ్డి, తోటకూర శ్రీకాంత్, సిద్దిఖీ, గుణశేఖర్, రాజా శీలన్, షాధం, నరేందర్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ గౌడ్, ఇమ్రాన్, ఫర్హాన్, గౌషే భాయ్, మునీర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి

### జూలై 24 బంద్‌కు ఏఐవైఎఫ్ మద్దతు

**కుషాయిగూడ,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువతపై దాడి చేసిన పోలీసులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. జూలై 24న విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఈసీఐఎల్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్ బేగ్, జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందన్నారు. ఈ ఘటనల నేపథ్యంలో పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో వరుసగా ప్రశ్నాపత్రాల




లీకేజీలు చోటుచేసుకోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీలో పోలీసులు లాఠీచార్జి చేయడం, భాష్పవాయు గోళాలు, నీటి ఫిరంగులు ప్రయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థను రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జూలై 24న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, యువత, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు పెద్ద ఎత్తున సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గిరిబాబు, శేఖర్, వికాస్ రెడ్డి, మల్లేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం టిడబ్ల్యూజేఎఫ్‌లో చేరిన సీనియర్ పాత్రికేయులు

**కాప్రా,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** పాత్రికేయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ సాధన లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (టిడబ్ల్యూజేఎఫ్) చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ పాత్రికేయులు గురువారం సమాఖ్యలో చేరారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్‌లో నిర్వహించిన సభ్యత్వ కార్యక్రమంలో బోడుప్పల్‌కు చెందిన సీనియర్ పాత్రికేయులు కల్మూరి ఎల్లయ్య, కాడిగల శ్రీకాంత్, జవహర్‌నగర్‌కు చెందిన ఆర్.సి. శ్రీకాంత్‌తో పాటు మరికొందరు పాత్రికేయులు టిడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వాన్ని స్వీకరించారు. రాష్ట్ర నాయకురాలు ఎస్.కె. సలీమా వారికి సభ్యత్వ పత్రాలు అందించి సమాఖ్యలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సభ్యత్వం స్వీకరించిన పాత్రికేయులు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల



పరిరక్షణ, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం టిడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందని, ఆ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో సమాఖ్యలో చేరినట్లు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతే వారి బలం అని, వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి పాత్రికేయుడు సంఘటితంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పాత్రికేయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారం కోసం సమాఖ్య కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల సాధన కోసం భవిష్యత్తులో మరింత బలోపేతమైన ఉద్యమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి బనావత్ రవినాయక్, జిల్లా నాయకులు సుధాకర్, విష్ణు, నర్సింహ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాప్రాలో ఘనంగా భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ వేడుకలు





**కాప్రా,జులై 23 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి గోపగాని పాండు)** భారతీయ మజ్దూర్ సంఘ్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాప్రా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారతీయ మజ్దూర్ ఉద్యోగుల సంఘం (రిజిస్టర్ నెంబర్--1157) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ జెండాను ఆవిష్కరించి కార్మిక ఐక్యతకు ప్రతీకగా వేడుకలు నిర్వహించారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాప్రా హౌస్ స్టోర్స్ భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకుడు రాజు కుమార్ సంఘ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులను సంఘటితం చేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, ఉద్యోగ హక్కుల సాధనలో సంఘటిత శక్తి అత్యంత కీలకమని నాయకులు అన్నారు. ప్రతి కార్మికుడు సంఘం బలోపేతానికి తోడ్పాటునందించి కార్మిక ఉద్యమాన్ని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో భారతీయ మజ్దూర్ సంఘ్ ఎప్పటికీ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విజయ నిర్మల, కార్యనిర్వాహక అధ్యక్షురాలు కవిత, గొలుసు నిర్వహణ సిబ్బంది రమేష్, రాజు, యాదగిరి, ఎల్లయ్య, ధర్మతేజతో పాటు భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు, కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సభ్యులు పరస్పరం ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుని సంఘ ఐక్యతను చాటిచెప్పారు.

## శ్రీ శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్





**మియాపూర్,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** శ్రీ శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ప్రత్యేక పూజ జరిగింది. మియాపూర్ పరిధిలోని ఎస్.ఆర్. ఎస్టేట్స్ కమ్యూనిటీ భవనంలో శ్రీ గంగాధర శాస్త్రి, రమాదేవి దంపతుల నిర్వహణలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో కమ్మ కార్పొరేషన్ అధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆయన వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడపా దుర్గా, మియాపూర్ విభాగం యువ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, వంశీ, ప్రవీణ్, వాసు, రత్నాచారి, వినోద్ సహా ఇతర నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో రాజీ లేదు.. బొంతు శ్రీదేవి స్పష్టం

### కుషాయిగూడలో అభివృద్ధి సందడి.. రూ.70 లక్షల పనుల పరిశీలన



**కుషాయిగూడ,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు)** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడ డివిజన్‌లో రూ.70 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్ నంబర్--1లోని శ్రీ పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన నిర్మిస్తున్న 200 మీటర్ల సిమెంట్ రహదారి పనులను మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పనుల పురోగతిని పరిశీలించి, నిర్మాణంలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం బొంతు శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగానే ఈ అభివృద్ధి పనులు మంజూరయ్యాయని తెలిపారు. కుషాయిగూడ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులను నివారించాలనే లక్ష్యంతో సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఈ పరిశీలనలో కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్‌పై బూత్ ఇంచార్జ్‌లతో సమీక్ష





**శేరిలింగంపల్లి,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే - ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూత్ ఇంచార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్, పలువురు కార్పొరేటర్లతో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని బూత్ ఇంచార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఒక్క కుటుంబం కూడా మిస్ కాకుండా పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ సర్వే డేటా ఆధారంగానే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని, కాబట్టి బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని అన్ని బూత్‌లలో ఎస్.ఐ.ఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజలంతా సర్వే సిబ్బందికి సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్ష సమావేశంలో డివిజన్ ముఖ్య నాయకులు, బూత్ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్ సమీక్ష

**శేర్లింగంపల్లి,జులై 23 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న)** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, విభాగాల అధ్యక్షులు, మాజీ పురపాలక ప్రతినిధులు, బూత్ స్థాయి సహాయకులు, పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మియాపూర్ విభాగంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి శేరిలింగంపల్లి శాసనసభ్యుడు అరేకపూడి గాంధీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు వి. జగదీశ్వర్ గౌడ్ హాజరై ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో పార్టీ శ్రేణుల బాధ్యతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి విభాగంలో ఓటర్ల సమగ్ర సవరణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పార్టీ నాయకులకు, బూత్ స్థాయి సహాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటరు నమోదు వివరాలు సరైనవిగా, తాజాగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని సూచించారు. సవరణ ప్రక్రియలో భాగంగా వివరాల సేకరణ పత్రాల నుంచి వాటి



అంతర్జాల నమోదు వరకు ప్రతి దశను జాగ్రత్తగా పర్యవేక్షించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఈ ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగస్వామ్యమై, తన పేరు ఓటర్ల జాబితాలో నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజలతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మియాపూర్ నాయకుడు యలమంచి ఉదయ్ కిరణ్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ పురపాలక ప్రతినిధులు, విభాగాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, బూత్ స్థాయి సహాయకులు, పార్టీ కార్యకర్తలు



తదితరులు పాల్గొన్నారు.

# భావనాఋషి సొసైటీ భూమిపై కొత్త వివాదం

**కోర్టు ఆదేశాలకూ తూట్లు.. సొసైటీ స్థలంలో నిర్మాణాలు**

**కుషాయిగూడ,జులై 23 .అక్షర టైమ్స్ : -(ప్రతినిధి గోపగాని పాండు)** కాప్రా పరిధిలోని శ్రీ భావనాఋషి సహకార గృహ నిర్మాణ సంఘానికి చెందిన స్థలంలో న్యాయస్థానంలో వివాదం కొనసాగుతుండగానే విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు చేపట్టడంపై సంఘ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టు యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత అధికారులు వాటిని పట్టించుకోకుండా భారీ యంత్రాలతో పునాదులు తవ్విస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి కోర్టు ఆదేశాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని, సంబంధిత శాఖల అధికారులను కోరారు.ఈ మేరకు గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు సీత ఆంజనేయులు మాట్లాడారు. కాప్రా పరిధిలోని సర్వే నంబర్--158లో ఉన్న 2.10 గుంటల స్థలం శ్రీ భావనాఋషి సహకార గృహ నిర్మాణ సంఘానికి చెందినదని తెలిపారు. ఈ భూమికి సంబంధించి 2001 సంవత్సరం నుంచి 2026 వరకు వివిధ న్యాయస్థానాల్లో పలు దఫాలుగా కేసులు విచారణలో ఉన్నాయని, ప్రస్తుతం కూడా ఆ న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. భూమిపై వివాదం ఉన్నప్పటికీ 2009లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ సంస్థ ఈ స్థలానికి లేఅవుట్ అనుమతి మంజూరు చేసిందని గుర్తు చేశారు. అన్ని రికార్డులు, పత్రాలు సంఘానికి అనుకూలంగా ఉన్నాయని, ప్రస్తుతం కూడా భూమి తమ సంఘ ఆధీనంలోనే ఉందని స్పష్టం చేశారు. న్యాయస్థానంలో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలను అధికారులు విస్మరిస్తున్నారని ఆరోపించారు. సుమారు రెండేళ్ల క్రితం అప్పటి తహశీల్దార్ సుచరిత సంఘ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని, సంఘానికి సంబంధించిన భూమిని ప్రభుత్వ



భూమిగా చూపించే ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. అంతేకాకుండా సంఘానికి వ్యతిరేకంగా బోర్డులు ఏర్పాటు చేయడం, రికార్డుల్లో మార్పులు చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ఈ చర్యలపై సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించిందన్నారు. ఈ వ్యవహారంలో సంయుక్త కలెక్టర్ జారీ చేసిన ఈ--2/1774/2025 ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. కేసును విచారించిన హైకోర్టు భూమికి సంబంధించి యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలు అమల్లో ఉన్నంతవరకు స్థలంలో ఎలాంటి మార్పులు, నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేసినప్పటికీ సంబంధిత అధికారులు వాటిని లెక్కచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని సీత ఆంజనేయులు తెలిపారు. బుధవారం, గురువారం విద్యుత్ శాఖ అధికారులు భారీ యంత్రాలతో స్థలంలోకి ప్రవేశించి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం కోసం పునాదులు తవ్వడం ప్రారంభించారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలు అమల్లో ఉండగానే ఈ చర్యలకు పాల్పడటం న్యాయవ్యవస్థను ధిక్కరించడమేనని వ్యాఖ్యానించారు.తహశీల్దార్, సంయుక్త కలెక్టర్ తప్పుడు సరిహద్దుల వివరాలు, తప్పుడు అలైన్‌మెంట్ ఆధారంగా విద్యుత్ శాఖను తప్పుదోవ పట్టించారని సంఘ ప్రతినిధులు ఆరోపించారు. ప్రజల ఆస్తి హక్కులను కాలరాస్తూ, న్యాయపరమైన వివాదంలో ఉన్న భూమిపై నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు చట్టబద్ధంగా వ్యవహరించాల్సింది పోయి వివాదాన్ని మరింత సంక్లిష్టం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం పేరుతో సంఘ స్థలాన్ని శాశ్వతంగా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు వెలువడే వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకుండా నిలిపివేయాలని, ఇప్పటికే ప్రారంభించిన పనులను వెంటనే నిలిపేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిష్పాక్షిక విచారణ నిర్వహించాలని, కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాల ఆదేశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఉంటుందని, అలాంటి ఆదేశాలను ఉల్లంఘించే చర్యలు ప్రజల్లో చట్టంపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. తమ సంఘానికి చెందిన భూమిని పరిరక్షించి న్యాయం చేయాలని, సంబంధిత శాఖల అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ముద్రిత, దృశ్య మాధ్యమాల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ విలేకరుల సమావేశంలో సంఘ ఉపాధ్యక్షుడు అవినాష్, నగరం సురేష్, కార్యదర్శి పున్న రమేష్, ఖజాంచి అవ్వారు రామకృష్ణ, సభ్యులు గుర్రం విశ్వేశ్వర్ రావు, కర్నాటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# వంతెనల భద్రత పర్యవేక్షణకు ఆధునిక సాంకేతికతపై సైబరాబాద్ కార్పొరేషన్ సమీక్ష

**శేర్లింగంపల్లి,జులై 23 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వంతెనలు, పైవంతెనల (ఫ్లైఓవర్ల) నిర్మాణ భద్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు 'నిరంతర నిర్మాణ ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ' అమలుపై సెంటినెల్-ఐక్యూ మరియు హైదరాబాద్ ఐఐటీ ప్రతినిధులతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అధునాతన సూచిక ఆధారిత సాంకేతికత మరియు సమాచార విశ్లేషణ వినియోగం ద్వారా వంతెనలు, పైవంతెనల నిర్మాణ స్థితిని నిరంతరం పర్యవేక్షించడం, వాటి మిగిలిన సేవా కాలాన్ని అంచనా వేయడం, నిర్మాణాల వృద్ధాప్య స్థితిని విశ్లేషించడం, అలాగే శాస్త్రీయ నిర్మాణ తనిఖీ మరియు పర్యవేక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై చర్చించారు. అప్పటికప్పుడు సమాచారాన్ని అందించే పర్యవేక్షణ సాంకేతికత ద్వారా నిర్మాణాలలో సంభవించే మార్పులను ప్రారంభ



దశలోనే గుర్తించి, అవసరమైన నిర్వహణ పనులు మరియు నివారణ చర్యలను సకాలంలో చేపట్టే విధానంపై అధికారులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సాంకేతిక విధానం ద్వారా ప్రజా భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు మౌలిక సదుపాయాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మాట్లాడుతూ, నగర మౌలిక సదుపాయాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను నియోగించడం కాలానుగుణ అవసరమని తెలిపారు. వంతెనలు, పైవంతెనల భద్రత, మన్నిక మరియు దీర్ఘకాలిక నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు ఇటువంటి సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సీనియర్ అధికారులు, సెంటినెల్-ఐక్యూ మరియు హైదరాబాద్ ఐఐటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై స్విగ్గీ ప్రతినిధులతో సమావేశమైన సైబరాబాద్ పురపాలక సంస్థ

**శేర్లింగంపల్లి,జులై 23 .అక్షర టైమ్స్ :పతినిధి ఎం.ఈరన్న)** ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందుబాటులో ఉండేలా చేయాలనే లక్ష్యంతో సైబరాబాద్ పురపాలక సంస్థ ఆహార భద్రతా ప్రమాణాల అమలును మరింత బలోపేతం చేసే దిశగా స్విగ్గీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. పురపాలక సంస్థ జారీ చేసిన హెచ్చరిక లేఖలకు స్పందనగా ఆరోగ్య మరియు పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంతర్జాల ఆహార పంపిణీ వేదికల ద్వారా సేవలు అందిస్తున్న ఆహార వ్యాపార సంస్థలు చట్టబద్ధ నిబంధనలను కచ్చితంగా పాటించేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. అలాగే పురపాలక సంస్థ మరియు స్విగ్గీ మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, వినియోగదారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. స్విగ్గీ తన వేదికపై కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆహార వ్యాపార సంస్థలకు భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ అనుమతి పత్రంతో



పాటు చెల్లుబాటు అయ్యే వర్తక అనుమతి పత్రాన్ని తప్పనిసరి చేయడానికి అంగీకరించింది. అలాగే పురపాలక సంస్థతో సమన్వయం కోసం ప్రత్యేక సమన్వయాధికారిని నియమించేందుకు కూడా అంగీకారం తెలిపింది. అదనంగా, ఆహార భాగస్వామ్య ఏజెన్సీలు మరియు ఆహార వ్యాపార సంస్థల కోసం ప్రామాణిక నిర్వహణ విధానాలు రూపొందించి అమలు చేయడంతో పాటు, ఆహార భద్రతా అనుమతి పత్రాలు పొందేందుకు అవసరమైన మార్గదర్శకాలను అందించేందుకు స్విగ్గీ అంగీకరించింది. అలాగే తన వేదికలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అదృశ్య వంటశాలలు (క్లౌడ్ కిచెన్లు) మరియు ఆహార విక్రయ కేంద్రాలు అన్ని చట్టబద్ధ నిబంధనలు పాటిస్తున్నాయో లేదో కఠినంగా తనిఖీ చేయనున్నట్లు తెలిపింది. ప్రజారోగ్య పరిరక్షణ, ఆహార భద్రతను నిర్ధారించడం పురపాలక సంస్థ అత్యున్నత ప్రాధాన్యతలలో ఒకటని సైబరాబాద్ పురపాలక సంస్థ పునరుద్ఘాటించింది. ఆహార భద్రతా ప్రమాణాల అమలు, పరిశుభ్రమైన ఆహార పద్ధతుల ప్రోత్సాహం మరియు వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం అంతర్జాల ఆహార పంపిణీ వేదికలు, ఆహార వ్యాపార సంస్థలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తూ చర్యలు కొనసాగిస్తామని పేర్కొంది.

# పోర్జరీ లతో ఆర్థిక నేరలకు పాల్పడిన డ్వాక్రా వి.ఒ.ఎ చదరం వెంకటలక్ష్మి పై చర్యలేవి

**చోద్యం చూస్తూ పట్టించుకోని అధికార్లు**

**గోకవరం,జులై 23 .అక్షర టైమ్స్ :** ఎంతో ప్రతిష్టాత్మకమైన విధి విధానాలతో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పేదరికానికి దిగువున ఉన్న పేద కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకొనేలా ఒక ప్రక్క ప్రభుత్వ యంత్రాంగం చూస్తూ రాష్ట్రంలో "యస్. హెచ్ . జి" ల ద్వారా కోట్లాది రూపాయలను మహిళల ఖాతాల్లో జమచేసి వారియొక్క పురోగతిని దృష్టిలో పెట్టుకుని వారి ఆర్థిక, సాంఘిక, అసమానతలు తొలగించి ప్రతీ పేద మహిళా తన కుటుంబాన్ని ఆర్థికంగా తీర్చుదిద్దుకోవాలనే ప్రభుత్వ ఆలోచనను ప్రక్కన పెట్టి పోర్జరీలతో ఆర్థిక నేరలకు పాల్పడిన "వి. ఒ ఎ" చదరం వెంకటలక్ష్మి పై అధికార్లు చర్యలు తీసుకోకుండా ఆమెను వెనకేసుకుని రావడం వెనుక అనేక అనుమానాలకు తావిస్తుందని ఇలా ఆమె వలన ఎంతమందిని మానసికంగా కుంగిపోయేలా చేస్తున్నారని, అధికార్లు ఏమీ పట్టనట్టు ఉండటం వెనుక అంతర్యమేమిటని, ఈ ఆర్థిక నేరాల వెనుక ఉన్న కుట్రను చేధించి, దీనికి బాధ్యులైన వారిని ఉద్యోగాలనుండి తొలగించి కఠినంగా




శిక్షించాలని, మరలా ఇలాంటి నేరలకు పాల్పడాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు తుసుకోవాలని బాధితులు కోరుతూతున్నారు. గుమ్మల్లదొడ్డి "గవర పేట" డ్వాక్రా మహిళా సంఘాలకు న్యాయం చేయాలని, చదరం వెంకటలక్ష్మి బారినుండి కాపాడాలని, ఆమెను "వి. ఒ. ఎ " గా కొనసాగకుండా ఆమె ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు. చర్యలు ఆమెపై తీసుకోని పక్షంలో రాష్ట్ర మంత్రిత్వ శాఖకు తెలియపరచ్చడానికి కూడా వెనుకంజ వేయబోమని వారు డ్వాక్రా అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీశెట్టి వరలక్ష్మి (గ్రూపు ప్రెసిడెంట్), అనుపోజు సరస్వతి (సెక్రటరీ ), ఆదారి మంజు, సూరిశెట్టి నాని, అబ్బిరెడ్డి చిన్ని (గ్రామ ఉపసర్పంచ్), సూరిశెట్టి రామారావు, సూరిశెట్టి సంధ్యా, సూరిశెట్టి మహాలక్ష్మి తదితర బాధిత డ్వాక్రా గ్రూపు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# వెయ్యి మంది మహిళలకు కంబాల ఉచితంగా పట్టు చీరలు పంపిణీ

**గోకవరం,జులై 23 .అక్షర టైమ్స్** :జగ్గంపేట మండలం బలభద్రపురం, వెంగాయమ్మ పురం రెండు గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కంబాల కానుక వనితల వేడుక పట్టు చీరలు పంపిణీ కార్యక్రమానికి మహిళాల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆయా గ్రామాల మహిళలు హారతులతో స్వాగతం పలికారు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, అభిమానులు పూలమాలలతో సత్కరించారు. ఆయా గ్రామాలలోని పలు ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, గ్రామ





దేవతలకు తొలి చీరలను సమర్పించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు బలభద్రపురంలో 300 మంది మహిళలు, వెంగాయమ్మ పురంలో 700 మందికి ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా మహిళలకు ఉచితంగా పట్టుచీరలను అందించేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని, వారిని గౌరవించుకోవడం మన బాధ్యతని అన్నారు. కులమతాలకు అతీతంగా జగ్గంపేట, రాజానగరం, రంపచోడవరం, మూడు నియోజకవర్గాల్లో తమ సేవలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల ఆశీర్వాదం, సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమాజ సేవే తన లక్ష్యమని అన్నారు. ధర్మాన్ని పాటించేవారి పక్కన ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు అరెస్ట్‌పై వైఎస్సార్సీపీ ఆగ్రహం

**కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్న ప్రభుత్వం**

**వైకాపా రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు**



**గోకవర,జులై 23 .అక్షర టైమ్స్ :** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత సిదిరి అప్పలరాజు అరెస్టు అప్రజాస్వామిక చర్య అని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు తీవ్రంగా విమర్శించారు. రోడ్డు ప్రమాద ఘటనను రాజకీయ కోణంలో చూపిస్తూ మాజీ మంత్రి అప్పలరాజును అరెస్టు చేయడం దుర్మార్గమని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయనమీడియాతో రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలనే లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు చర్యలు కొనసాగిస్తున్నారనిఆరోపించార.రాష్ట్రంలో చట్టబద్ధ పాలనకు బదులుగా "రెడ్ బుక్ రాజ్యాంగం" అమలవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. సంబంధితఘటనపైచట్టపరమైన విచారణ జరపాల్సిన సమయంలో తండ్రి, కొడుకులను అరెస్టు చేసి వేధించడం అన్యాయమనిపేర్కొన్నారు.సామాన్య బీసీ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సిదిరి అప్పలరాజు వైద్య విద్య పూర్తి చేసి ప్రజలకు సేవలందించిన వైద్యుడని, అలాంటి వ్యక్తిపై రాజకీయ కక్షతో చర్యలు తీసుకోవడం బాధాకరమని ఏడుకొండలు అన్నారు. రాష్ట్రంలో బీసీలు, దళితులపై జరుగుతున్న ఘటనల పట్ల యువత, ప్రజల్లో ఆందోళన నెలకొందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను చట్టపరంగాను, రాజకీయంగానుఎదుర్కొంటామని స్పష్టం చేశారు.అప్పలరాజు అరెస్టు నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలు, విచారణ పురోగతిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# రీల్స్‌తో క్రేజ్..స్వయం ఉపాధితో సక్సెస్..

**పొదలకూరు మహిళ సుదర్శనకు సోషల్ మీడియాలో విశేష ఆదరణ**

**మిలియన్ల వ్యూస్‌తో గుర్తింపు..**

**టిఫిన్ సెంటర్, చీరల వ్యాపారానికి సోషల్ మీడియానే ప్రచారం**

**అసభ్యత లేకుండా మంచి కంటెంట్ ఇస్తే ప్రజలు తప్పక ఆదరిస్తారు: యూట్యూబర్ సుదర్శన**

**పొదలకూరు,జులై 23 .అక్షర టైమ్స్ :(రిపోర్టర్ ఆనంద్)** సోషల్ మీడియా నేటి యువతకే కాకుండా మహిళలకు కూడా కొత్త అవకాశాల ప్రపంచంగా మారింది. ఒకప్పుడు వినోదానికే పరిమితమైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలు ప్రస్తుతం ఎంతోమందికి ఉపాధి మార్గాలను



చూపిస్తున్నాయి. పట్టణాల్లో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు గ్రామాలకు కూడా విస్తరించింది. గ్రామీణ మహిళలు సైతం తమ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తూ గుర్తింపుతో పాటు ఆదాయాన్ని కూడా సంపాదిస్తున్నారు.పొదలకూరుకు చెందిన సుదర్శన సోషల్ మీడియాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. యూట్యూబర్‌గా, ఇన్‌స్టాగ్రామ్ క్రియేటర్‌గా ఆమె రూపొందించే రీల్స్‌కు లక్షల నుంచి మిలియన్ల వరకు వ్యూస్ వస్తున్నాయి.వినోదంతో పాటు కుటుంబ విలువలు, సంప్రదాయాలు, దైనందిన జీవితానికి సంబంధించిన అంశాలతో ఆమె రూపొందించే వీడియోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.సోషల్ మీడియాలో వచ్చిన ఆదరణను స్వయం ఉపాధి దిశగా మలుచుకున్న సుదర్శన ఇటీవల పొదలకూరు సంగం రోడ్డులో కెసిఆర్ కళ్యాణమండపం పక్కన టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించారు. తన వ్యాపారానికి ప్రచారం కోసం ప్రత్యేకంగా రీల్స్ రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వాటికి మంచి స్పందన లభించింది. అలాగే చీరల విక్రయాన్ని కూడా ప్రారంభించి, కొత్త డిజైన్లను రీల్స్ రూపంలో పరిచయం చేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. సోషల్ మీడియాను వ్యాపార అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.ఈ సందర్భంగా సుదర్శన మాట్లాడుతూ, "ఒకరి కింద ఉద్యోగం చేయడం కంటే స్వయం ఉపాధి పొందడమే తన లక్ష్యమని తెలిపారు.సోషల్ మీడియాలో అసభ్యకరమైన కంటెంట్ కాకుండా కుటుంబ సభ్యులంతా కలిసి చూసేలా మంచి వీడియోలు చేస్తే ప్రజలు తప్పకుండా ఆదరిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ తనను తమ ఇంటి ఆడబిడ్డలా అభిమానిస్తూ ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. అదే నాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని తెలిపారు.తాను చేసే ప్రతి వీడియో వెనుక తన భర్త, పిల్లలు, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందన్నారు.వారి ప్రోత్సాహమే తన విజయానికి బలమని చెప్పారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల మహిళలు కూడా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వంటలు, చేతిపనులు, వ్యవసాయం, ఫ్యాషన్, వ్యాపారం, వినోదం, సామాజిక అంశాలు వంటి విభిన్న రంగాల్లో రీల్స్ రూపొందిస్తూ సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఈ గుర్తింపును స్వయం ఉపాధికి, చిన్న వ్యాపారాల అభివృద్ధికి వినియోగించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.సుదర్శన వంటి మహిళల విజయగాథలు.. గ్రామీణ యువతకు, మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తూ "సోషల్ మీడియా కేవలం వినోద వేదిక మాత్రమే కాదు... అవకాశాలను అందిపుచ్చుకునే సాధనం కూడా" అనే విషయాన్ని మరోసారి చాటిచెబుతున్నాయి.

# నిరాశ్రయుల ఆశ్రమంలో మాలేపాటి లోకేష్ జన్మదినం వేడుక

**నెల్లూరు,జులై 23 .అక్షర టైమ్స్ :** దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి లోకేష్ జన్మదినం సందర్భంగా నెల్లూరులోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నటువంటి నిరాశ్రయుల ఆశ్రమ కేంద్రంలో మాలేపాటి లోకేష్ జన్మదినం వేడుక గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా మాలేపాటి లోకేష్ చేతుల మీదుగా అక్కడ ఉన్న 50 మంది నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా రాత్రి భోజనం ఏర్పాట్లుచేసి వారందరికీ దుప్పట్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారందరూ మాలేపాటి లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. కలకాలం సంతోషంగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి లోకేష్ వెంట





ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు ఉన్నారు.

# మృతుడు టిడిపి కార్యకర్త చాట్ల వాసు కుటుంబానికి 5 లక్షల ఆర్థిక

**పరామర్శించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**

**మీకు అడ్డు అనుకుంటే నన్ను హతమార్చండి.. ప్రతాప్ రెడ్డి**

**మా కార్యకర్తలను చంపుతూ పోతే సహించేది లేదు**

**వైసిపికి ఎమ్మెల్యే ఘాటుగా స్పష్టం**





కావలి,జులై 23 .అక్షర టైమ్స్ : కావలిలో వైసిపి పార్టీ నాయకుల దాష్టీకం ఎక్కువైపోయి టిడిపి పార్టీ నేతలను హతమార్చడమే అజెండాగా పెట్టుకొని జీవిస్తున్నారని, ఇక చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని తాను కన్నెర్ర జేస్తే కావలిలో వైసిపి పార్టీ ఏమైపోతుందో ఆలోచించుకోవాలని వైసీపీ కావలి ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కి, పార్టీ నేతలకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి గట్టిగానే హెచ్చరికలు చేశారు. గురువారం కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ, తాగేటీపాలెం గ్రామంలో ఇటీవల వైసిపి సుపారీ గుండాల చేతిలో హత్యకు గురైన చాట్ల వాసు కుటుంబాన్ని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పరామర్శించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో వైసీపీ అధినేత జగన్ నుంచి గల్లీ లీడర్ల వరకు పదవి పోయిన ఆలోచనతో తట్టుకోలేక ఇలా అడ్డుగా వారికి కనిపిస్తున్న టిడిపి పార్టీ నాయకులపై, కార్యకర్తలను హతమార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఇటీవల కావలి మండలంలో తమ టిడిపి కార్యకర్తలను హతమార్చాలని చూస్తున్నారని ఘాటుగా స్పందించారు. చాట్ల వాసు కుటుంబ సభ్యులను పరామర్శించిన బాధిత కుటుంబ సభ్యుల నుంచి ఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.తన భర్తను దారుణంగా హత్య చేశారని కన్నీటి పర్యంతమైన చాట్ల వాసు భార్య తన ఆవేదనకు అవధులు లేకుండా పోయాయి. చాట్ల వాసు కుటుంబానికి పార్టీ తరుపున రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అందజేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడి చేశారు. బాధిత కుటుంబానికి ఉద్యోగం సహా అవసరమైన ప్రభుత్వ సహాయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. చాట్ల వాసు ఏం తప్పు చేశాడని ఇంత దారుణంగా హత్య చేశారు?" అని ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చాట్ల వాసును ఇంత దారుణంగా హత్య చేయడం నా మనసును కలచివేసింది" అని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.తాగేటివారిపాలెం అరుంధతివాడ ప్రశాంతతకు మారుపేరు అని, అలాంటి గ్రామంలో ఇలాంటి ఘటన జరగడం అత్యంత బాధాకరం" అన్నారు. మాజీ సర్పంచ్, వైసీపీ రూరల్ మండలం ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంద మధు సుఫారీ గ్యాంగ్‌తో ఈ దారుణానికి పాల్పడటం దారుణం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి,గ్రామస్థాయి నాయకుల ఆలోచనా విధానం ఒకేలా ఉందని ఎమ్మెల్యే విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ రెడ్డి రాజకీయంగా ఎదుర్కోలేక హత్య రాజకీయాలకు తెర తీస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇకపై టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక మా నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు" అని ఇది చాలా తప్పిదం చేస్తున్న అంశంగా హెచ్చరించారు. మా నాయకుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోను" మేమేంటో చూపిస్తాం అంటూ ఘాటుగా మాట్లాడారు."ప్రతాప్‌రెడ్డి.. మీ రాజకీయ జీవితానికి అడ్డుగా ఉన్నామంటే, నేను అడ్డుగా ఉంటే నన్ను చంపేయండి, అంతేగానీ, మా నాయకుల జోలికి వస్తే సహించను" అని ఎమ్మెల్యే హెచ్చరించారు."ఒక అరగల కృష్ణయ్య, ఒక చాట్ల వాసు ఇలా మీరు చేస్తూ పోతుంటే ఇకపై చూస్తూ ఊరుకోం" అంటూ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఘాటుగా స్పందించారు. వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించి రాజకీయాలు చేయాలని చూస్తుంది అని, ప్రజలంతా వీరి వైఖరిని గుర్తించి ఖండించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కావలి నియోజకవర్గంలో శాంతి భద్రతలు కాపాడటమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.వైసిపి పార్టీ గ్రామాల్లో వర్గ విభేదాలు సృష్టించే ప్రయత్నాలను అడ్డుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటివి జరగకుండా ఉండేందుకు కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలను భయపెట్టే సంస్కృతికి తావివ్వబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కావలి ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలను సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు.చాట్ల వాసు కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని, అండగా టిడిపి ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవో 396ను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కి స్టాంపు రైటర్లు, వెండర్లు వినతి

**ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానంటూ సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే**



**కావలి,జులై 23 .అక్షర టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నంబర్ 396 ను తక్షణమే రద్దు చేయాలంటూ, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కి, కావలి కి చెందిన డాక్యుమెంట్ స్టాంపు రైటర్లు, వెండర్లు కలిసి గురువారం వినతిపత్రం సమర్పించారు.? ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 396 అమలులోకి రావడం వల్ల తమ వృత్తిపరమైన అవకాశాలు దెబ్బతింటున్నాయని, దీనివల్ల తమపై మరియు తమ కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని, ఐతే ఈ జీవో వల్ల తమ జీవనోపాధి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. కావున ఈ విషయాన్ని ప్రభుత్వం వద్ద లేవనెత్తి, జీవో 396 ను వెంటనే రద్దు చేయించేలా అసెంబ్లీలో ప్రతిపాదించి, తమకు న్యాయం చేయాలని వారు కోరారు. వెండర్ల తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానంటూ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించారు. అలాగే కావలి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద వారు నిరసన కొనసాగిస్తూ, ర్యాలీ కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అమీరిశెట్టి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసన్న కుమార్, తదితర సంఘ నాయకులు, లేఖరులు పాల్గొన్నారు.

# మంగళగిరి లో జీస్టాట్ బెంచ్ ప్రారంభం

**ఉన్నతాధికారులు, ప్రముఖుల మధ్య బెంచ్ ను ప్రారంభించిన న్యాయమూర్తి భాస్కరరెడ్డి వేమిరెడ్డి**





**విజయవాడ,జులై 23 .అక్షర టైమ్స్ : ప్రతినిధి** జీఎస్టీ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా, అప్పీళ్ల ను విచారించడానికి కేంద్ర ప్రభుత్వం గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిల్లెట్ ట్రిబ్యునల్ ( జీస్టాట్ ) ను ఏర్పాటు చేసిందని జీస్టాట్ ఆంధ్రప్రదేశ్ న్యాయవిభాగం ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి వేమిరెడ్డి తెలిపారు. గురువారం మంగళగిరి లో పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖులు మధ్య ఆయన ఆంధ్రప్రదేశ్ జీస్టాట్ బెంచ్ ను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి వేమిరెడ్డి మాట్లాడుతూ..జీస్టాట్ అనేది వస్తువులు మరియు సేవల పన్ను చట్టాల క్రింద స్థాపించబడిన ఒక చట్టబద్దమైన అప్పిలేట్ సంస్థ అన్నారు. భారతదేశ జీఎస్టీ ప్రయాణంలో జీస్టాట్ ఒక ముఖ్యమైన మైలురాయి అన్నారు. జీఎస్టీ వివాద పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేసే దిశగా జరిగిన ఈ కీలక పరిణామంలో ప్రారంభోత్సవ రోజునే అప్పీళ్ళ విచారణలు కూడా మొదలయ్యాయి. జీఎస్టీ అప్పీళ్ళ పరిష్కారంలో ఏకరూపత మరియు సమర్థతను పాటిస్తూనే, పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడంలో ట్రిబ్యునల్ యొక్క నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. అప్పిల్లెట్ యంత్రాంగాన్ని పూర్తిగా కార్యరూపంలోకి తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల సమిష్టి కృషిని భాస్కరరెడ్డి ప్రశంసించారు. జీస్టాట్ డిప్యూటీ రిజిస్ట్రార్ వీ ఎస్ కే రాయలు మాట్లాడుతూ.. ఈ బెంచ్ ఏర్పాటు వల్ల జీఎస్టీ అప్పీళ్ళ కు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్ అంతటా పన్ను చెల్లింపుదారులకు న్యాయం సులభంగా అందుబాటు లోకి వస్తుందని, న్యాయపరమైన వివాదాలు తగ్గుతాయని, జీఎస్టీ విధానం మరింత బలోపేతం అవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జీస్టాట్ సాంకేతిక విభాగం సభ్యులు సతీష్ కుమార్ అగర్వాల్, స్టేట్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎ. బాబు, ప్రత్యేక కమిషనర్ నూతలపాటి సౌమ్య, జీఎస్టీ అప్పీల్స్ కమిషనర్ దేవేష్ గుప్తా, కస్టమ్స్ కమిషనర్ ఆర్. కె. రామన్, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్, కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, జీఎస్టీ అదనపు కమిషనర్ జీ. రామకృష్ణ రాజు యాదవ్, కోర్టు ఆఫీసర్లు వినయ్ కృష్ణ దాసి, సి. హెచ్ ప్రత్యూష అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఎ. పి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ట్యాక్స్ బార్ సభ్యులు, పలువురు పన్ను నిపుణులు పాల్గొన్నారు.

# తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించాలి.!

**ఛాంపియన్ ఫార్మర్స్ శిక్షణ కార్యక్రమంలో ఏ.డి.ఏ నాగరాజు**





**కావలి,జులై 23 .అక్షర టైమ్స్ :** తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడిని ఇచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలని కావలి వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు పేర్కొన్నారు. గురువారం కావలి ఏ డి ఏ కార్యాలయంలో కావలి డివిజన్ స్థాయిలోని ఛాంపియన్ ఫార్మర్స్ కు నాణ్యమైన పంటలను, తక్కువ ఖర్చుతో ఎలా పండించాలో తెలియచేయుటకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అల్లూరు, బోగోలు, దగదర్తి, కావలి మండలాలకు చెందిన డివిజన్ స్థాయి ఛాంపియన్ ఫార్మర్స్ విచ్చేసారు. అలాగే ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల ప్రత్యేకించి ఏర్పాటు చేయించిన ముఖ్య ఉద్దేశం ప్రకారం ఈ ఛాంపియన్ ఫార్మర్స్ ను ఏర్పాటు చేసి, వారికి నాణ్యమైన పంటలు పండించే విధానంపై తరగతులను ఏర్పాటు చేశారు. వీరి ద్వారా మిగిలిన రైతులు కూడా అవలంభించే అవకాశాలపై తెలియజేశారు. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో వరి, వేరుశనగ పంటలు ఎక్కువగా పండిస్తారు. కనుక ఆయా పంటలపై తక్కువ ఖర్చుతో పిచికారి మందులు, ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట ఎరువులు, మిత్ర పురుగుల సంరక్షణ, వంటి వాటిపై అవగాహన పెంచుకొని, వ్యవసాయం చేపట్టినట్లయితే ఖర్చు తక్కువతోనే నాణ్యమైన దిగుబడి, ఆరోగ్యకరమైన పంట చేతికి వస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్ లో పంటల బీమా పై అవగాహన కల్పించారు. బ్యాంకు ఆఫీసర్లను కలిసి రైతుల యొక్క అనుమతి తెలియజేసి, బీమా ఏర్పాటు చేసుకోవలసినదిగా తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులలో ఛాంపియన్ ఫార్మర్స్ దాదాపు 40 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దగదర్తి వ్యవసాయ అధికారి హరి కరుణాకర్ రెడ్డి, బోగోలు మండల వ్యవసాయ అధికారిని బి శైలజ, అల్లూరు మండలం వ్యవసాయ అధికారిని కళారాణి, కావలి మండలం వ్యవసాయ అధికారిని లలిత లు పాల్గొన్నారు.

# తిరుమల ఘాట్‌రోడ్డులో హనుమాన్ విగ్రహం చోరీ

## 14 గంటల్లోనే నిందితుడి అరెస్టు



తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడో మైలు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమాన్ విగ్రహం చోరీ ఘటన కలకలం సృష్టించింది. భారీ ఆంజనేయస్వామి విగ్రహం కింద ప్రతిష్ఠించిన చిన్న రాతి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తి అపహరించడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. 2000 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గోవిందమాల ధరించిన వ్యక్తి ఘాట్‌రోడ్డుపై నుంచి ఆలయం వద్దకు చేరుకుని, విగ్రహాన్ని వస్త్రంలో చుట్టుకుని తీసుకెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో స్పష్టంగా నమోదయ్యాయి. ఈ ఘటనపై వెంటనే స్పందించిన జిల్లా పోలీసు యంత్రాంగం, టీటీడీ విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. విగ్రహం చోరీ వ్యవహారం ప్రాధాన్యత సంతరించుకోవడంతో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుడు జస్వంత్‌రెడ్డిగా పోలీసులు గుర్తించారు. పీఏసీ యాత్రిక సముదాయం నుంచి జీపులో తిరుపతికి బయలుదేరిన అతడు, ఏడో మైలు వద్ద దేవుడికి దండం పెడతానంటూ వాహనం ఆపించి, ఆ సమయంలో విగ్రహాన్ని అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద రైల్వే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, విచారణ కొనసాగిస్తున్నారు. ఘటన జరిగిన 14 గంటల్లోనే నిందితుడిని పట్టుకోవడం టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసుల సమన్వయానికి నిదర్శనంగా నిలిచింది.టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి మాట్లాడుతూ, సంప్రదాయాల ప్రకారం పుణ్యాహవాచనం నిర్వహించి, హనుమంతుడి విగ్రహాన్ని యథాతథ స్థానంలో తిరిగి ప్రతిష్ఠించినట్లు తెలిపారు. విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాన్ని పునరుద్ధరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయం చుట్టూ ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు, అలిపిరి కాలినడక మార్గంలోని విగ్రహాల వద్ద అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే గుర్తించి నిందితులను పట్టుకునే పటిష్ఠ నిఘా వ్యవస్థ టీటీడీ వద్ద ఉందని ఆయన స్పష్టం చేశారు.తిరుమల డౌన్ ఘాట్ రోడ్డులో 7వ కిలోమీటర్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో జరిగిన ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ ఘటనను తిరుపతి జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి, నిందితుడిని అదుపులోకి తీసుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకోవడం అభినందనీయమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే స్పందించి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాల సహాయంతో కేవలం 24 గంటల్లోపే కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగానికి, జిల్లా ఎస్పీకి, దర్యాప్తు బృందాలకు, టీటీడీ విజిలెన్స్ అధికారులకు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అభినందనలు తెలిపారు.ప్రాథమిక సమాచారాన్ని సేకరించి నిందితుడిని ముందుగా గుర్తించడంలో టీటీడీ విజిలెన్స్ బృందం కీలక పాత్ర పోషించిందని మంత్రి పేర్కొన్నారు. నిందితుడి కదలికలు, ప్రయాణ వివరాలు, ఫోన్ నంబర్ తదితర కీలక సమాచారాన్ని సాంకేతికంగా గుర్తించి వెంటనే తిరుపతి జిల్లా పోలీసులకు అందించడం ద్వారా దర్యాప్తు వేగవంతమైందన్నారు. ఈ మధ్యకాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ~~ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా లభించిన సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో కూడా కేసు ఛేదింపులో విలువైన ఆధారాలు లభించాయని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించడం వల్లే కేసును అత్యంత వేగంగా ఛేదించడం సాధ్యమైందన్నారు. తిరుమల వంటి మహా పుణ్యక్షేత్రంలో మాత్రమే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏ ఒక్క ఆలయంలోనైనా దేవతా విగ్రహాలపై దుశ్చర్యలకు పాల్పడినా కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని మంత్రి స్పష్టం చేశారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ఎప్పటికప్పుడు సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్లే కేసును వేగంగా ఛేదించడం సాధ్యమైందన్నారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తిరుమలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలు, ఉపాలయాలు, ఘాట్ రోడ్లు, పరిసర ప్రాంతాల్లో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు నిఘా వ్యవస్థను అత్యాధునిక సాంకేతికతతో బలోపేతం చేయాలని సంబంధిత అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రజలు, భక్తులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర నూతన భవన ప్రారంభోత్సవానికి మంత్రి సవిత ని ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి




**గిద్దలూరు,జులై 23 .అక్షర టైమ్స్ :(రిపోర్టర్ మల్లాపురం సాగర్ )** గిద్దలూరు పట్టణంలోని పాత చాణక్య పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి యస్ . సవిత ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 10:30 గంటలకు గిద్దలూరులో నిర్వహించనున్న నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతము చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు.

# యడవల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య



**రాచర్లజులై 23 .అక్షర టైమ్స్ : మార్కాపురం జిల్లా** రాచర్ల మండలం, ఎడవల్లి గ్రామంలో గురువారం ఉదయం ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది.ఎడవల్లి గ్రామానికి చెందిన యల్లా రంగస్వామి తన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నాడు.మృతదేహాన్ని పోస్ట్ మార్టం కొరకు గిద్దలూరు ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.మృతికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదు.

# తక్కువ టైంలో ఎక్కువగా నీరు తాగుతున్నారా..

### వాటర్ ఇంటాక్సికేషన్ అంటే
### రోజుకు ఎంత వాటర్ తాగాలి



'రోజూ తగినన్ని నీళ్లు తాగండి, అనారోగ్యాలు దరిచేరవు' అని డాక్టర్లు చెబుతుంటారు. నీరు మన శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడమే కాకుండా జీర్ణక్రియ, రక్త ప్రసరణ, శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, మెదడు సక్రమంగా పనిచేయడానికి కీలక పాత్ర పోషిస్తుంది.కానీ, కొంతమంది కళ్లు మూసుకుని గడగడా తగేస్తారు. ఇలా తక్కువ సమయంలో అతిగా నీరు తాగడం ఆరోగ్యానికి ప్రమాదకరమంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఒకేసారి అతిగా నీరు తాగడం వల్ల కలిగే పరిణామాలు, అది ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరమో ఇప్పుడు తెలుసుకుందాం!

**అతిగా నీరు తాగడం వల్ల :** తక్కువ సమయంలో అతిగా నీరు తాగడం వల్ల రక్తం పలుచన అవుతుంది, శరీరంలోని ఎలక్ట్రోలైట్లు తగ్గుతాయని అధ్యయనం పేర్కొంది. దీనివల్ల 'వాటర్ ఇంటాక్సికేషన్' లేదా 'హైపోనట్రీమియా' అనే తీవ్రమైన పరిస్థితికి దారితీస్తుందని తెలిపింది. ఇలాంటి పరిస్థితిలో శరీర కణాలు నీటితో ఉబ్బిపోతాయి. మెదడుపై ఒత్తిడి పెరుగుతుంది. ఇది కొన్నిసార్లు ప్రాణాంతకం కూడా కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ ప్రజలలో ఇది అరుదుగా జరిగినప్పటికీ, క్రీడాకారులు, ఎక్కువసేపు వ్యాయామం చేసేవారు లేదా దాహం వేయకపోయినా నిరంతరం నీరు తాగే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు.

నిద్ర ఎక్కువైనా అనర్థమే - రోజుకు ఎన్ని గంటలు నిద్రించాలి? - పరిశోధనలు ఏం చెప్తున్నాయంటే!

**ఆరోగ్యానికి ఎంత ప్రమాదకరం :** నిరంతరం రంగులేని మూత్రం : శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తాగినప్పుడు మూత్రం రంగు కోల్పోయి నీళ్లలా కనిపిస్తుంది. ఇది రక్తం లోని సోడియం వంటి ఎలక్ట్రోలైట్లను తగ్గించి హైపోనాట్రేమియాకు దారితీసే ప్రమాదం ఉంది. లేత పసుపు రంగులో ఉండటం శరీరం సరైన మోతాదులో హైడ్రేటెడ్‌గా ఉందని చెప్పడానికి ఒక సంకేతం.

**కిడ్నీలపై భారం :** కిడ్నీలు గంటకు సుమారు 0.8 నుంచి 1.0 లీటర్ల నీటిని మాత్రమే బయటకు పంపగలవు. అంతకంటే ఎక్కువ తాగితే కిడ్నీలపై అధిక భారం పడుతుందంటున్నారు నిపుణులు. ఎక్కువ నీరు తాగినప్పుడు, కిడ్నీలు అదనపు నీటిని తొలగించలేవని ఝుఎశీఎశ్రీఱఅఅఎ అధ్యయనం పేర్కొంది.వికారం, వాంతులు, మైకం : శరీరంలో సోడియం లెవల్స్ తగ్గిపోవడం వల్ల వికారం, వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీనిని చాలామంది డీహైడ్రేషన్ అని అనుకుంటారు. కానీ ఇది అతిగా నీరు తాగడం వల్ల వస్తుంది.దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు నీళ్లు అవసరానికి మించి తాగితే కిడ్నీ, గుండెపై ఒత్తిడి పడే అవకాశం ఉంది. ఒకేసారి ఎక్కువ మోతాదులో నీళ్లు తాగితే గుండెకు రక్తం పంప్ కావడం కష్టమవుతుంది. గుండె, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరడం, చేతులు, కాళ్లు వాపులు వస్తాయి

**మెదడు వాపు కారణంగా తలనొప్పి :** శరీరంలో సోడియం స్థాయిలు తగ్గినప్పుడు మెదడు కణాలలోకి నీరు చేరి అవి వాపునకు గురవుతాయి, దీనివల్ల తీవ్రమైన తలనొప్పి వస్తుంది.

**గందరగోళం, మతిమరుపు :** అధిక నీటి వినియోగం వల్ల మెదడు పనితీరు ప్రభావితమై దృష్టి పెట్టలేకపోవడం, చిరాకు లేదా అలసట కలుగుతాయి.

**చర్మం వాపు :** చేతులు, కాళ్లు, పెదవులు, ముఖం వాపునకు గురవుతాయి. చర్మం వెలవెలబోయినట్లు లేదా సాగినట్లు కనిపిస్తుంది. అలసట, బలహీనత: అదనపు నీటిని బయటకు పంపడానికి కిడ్నీలు ఎక్కువగా శ్రమించడం వల్ల శరీరం అలసిపోయినట్లు అనిపిస్తుంది.

**కండరాల తిమ్మిర్లు :** ఎలక్ట్రోలైట్స్ లోపం వల్ల కండరాలలో తిమ్మిర్లు లేదా నొప్పులు రావచ్చు. ఫిట్స్ వచ్చే ప్రమాదం: తీవ్రమైన పరిస్థితుల్లో సోడియం స్థాయిలు అకస్మాత్తుగా పడిపోయి ఫిట్స్ రావడం లేదా స్పృహ తప్పిపోవడం జరగవచ్చు. తక్కువ వ్యవధిలో అధిక మొత్తంలో నీరు తాగినప్పుడు సంభవించే మెదడు వాపు, మూర్ఛ లాంటి సమస్యలు వస్తాయని ంఎఆవఅఎవఎఅఈవష్ అధ్యయనం పేర్కొంది.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది :**
మెదడు వాపు శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది, ఇది ప్రాణాంతకంగా మారవచ్చు.

**ఎంత నీరు త్రాగాలి? :**
వయసు, శారీరక శ్రమ, ఆరోగ్య పరిస్థితులతో పాటు ఉష్ణోగ్రతలు, వాతావరణాలపై నీటి మోతాదు ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో వాతావరణం, ఆహార పద్ధతుల దృష్ట్యా పురుషులు 3 లీటర్లు, మహిళలు 2.2 నుంచి 2.5 లీటర్ల నీళ్లు తాగాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అధ్యయనం పేర్కొంది. మామూలుగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని చీ×ఎ అధ్యయనం పేర్కొంది.

# "ఉదయాన్నే మేల్కొనే గుండెపోటు"

### ఎందుకు అలా జరుగుతుందంటే!
### ఆరోగ్యకరమైన నిద్రతో 'గుండె' పదిలం
### పరిశోధనలు, అధ్యయనాలు తేల్చిందిదే!



ఇంటా బయటా, రాత్రీ, పగలూ ఇలా ఎప్పుడైనా, ఎక్కడైనా గుండెపోటు రావొచ్చు. తీవ్ర ఒత్తిడికి, భావోద్వేగాలకు గురైనప్పుడూ దాడి చేయొచ్చు. దీనికి వేళాపాళా అంటూ ఏమీ ఉండదు. అయితే, చాలామందిలో తెల్లవారుజామున, ఉదయం పూట ఎక్కువగా వస్తుండటం విచిత్రం. ఈ క్రమంలో రాత్రి 11 గంటల కన్నా ఉదయం 9 గంటల సమయంలో గుండెపోటు వచ్చే అవకాశం మూడు రెట్లు ఎక్కువగా ఉందని ఓ పరిశోధనలో తేలింది. ఇందుకు రకరకాల అంశాలు కారణమవుతుంటాయంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!నిద్రపోయేటప్పుడు శరీరం విశ్రాంతి స్థితిలో ఉంటుంది. మార్నింగ్ మెలకువ వచ్చే టైంకి శరీరాన్ని సన్నద్ధం చేయటానికి అడ్రినలిన్, కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్ల, మోతాదులు పెరుగుతుంటాయి. చురుకుగా, అప్రమత్తంగా ఉండటానికి తోడ్పడే ఇవి గుండె వేగం, బీపీ పెరిగేలా చేస్తుంటాయి. దీంతో గుండె, ధమనుల మీద అదనపు భారం పడుతుందంటున్నారు నిపుణులు. అప్పటికే హైబీపీ, గుండె జబ్బులున్న వారికిది హానికరంగా పరిణమిస్తుందట. రక్త ప్రసరణ సాఫీగా సాగకపోవటం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, రక్తనాళాల్లో పూడికలు గలవారికి, అవి చిట్లిపోయి ఉదయం వేళల్లో గుండెపోటు ముప్పు ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు.గాయాలైనప్పుడు రక్తం గడ్డకడితే ప్రాణాలు నిలబడతాయి. కానీ, రక్తనాళాల లోపల రక్తం గడ్డలు ఏర్పడితే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో సహజంగానే రక్తాన్ని పలుచగా, గడ్డలు కట్టకుండా చూసే వ్యవస్థ ఉంటుందని అంటున్నారు. కాకపోతే, ఇది మార్నింగ్ టైం ప్లేట్‌లెట్లు చురుకుగా పనిచేయటం కారణంగా రక్తం గడ్డకట్టే స్వభావం పెరుగుతుందట. ఇది రక్త ప్రసరణ తీరును దెబ్బతీయడం వల్ల గుండెపోటు వచ్చే



ముప్పు ఎక్కువవుతుంది.రక్తం సాఫీగా సరఫరా కావాలంటే రక్త నాళాలు మృదువుగా, సాగేలా ఉండాలి. ఉదయం పూట రక్తనాళాలు మామూలుగానే బిగువుగా ఉంటాయి. అదే సమయంలో బీపీ కాస్త పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. దీనికి తగినట్టుగా రక్తనాళాలు సాగకపోతే గుండె మీద భారం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.మార్నింగ్ టైం నీళ్లు బాగానే తాగుతాం. కానీ, రాత్రిపూట మాత్రం తక్కువగా తీసుకుంటాం. కొందరు మధ్యలో మూత్ర విసర్జనకు లేవాల్సి వస్తుందని నీళ్లు తక్కువగా తాగుతారు. ఫలితంగా, శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. దీంతో రక్తం పరిమాణం తగ్గుతుందంటున్నారు నిపుణులు. మరోవైపు, రక్తంలో ఉప్పు మోతాదు ఎక్కువై, రక్తం చిక్కబడుతుందని చెబుతున్నారు. ఇలాంటప్పుడు శరీరమంతా రక్తాన్ని సరఫరా చేయటానికి గుండె మరింత బలంగా పని చేయాల్సి వస్తుందట. ఇది గుండెకు ముప్పును తెచ్చిపెడుతుంది.నిద్రలేమి గుండెకు చేటు చేస్తాయి. నిద్రపోతున్నప్పుడు స్లీప్ అప్నియా (కాసేపు శ్వాస ఆగటం), నిద్రలేమి వంటి సమస్యలు కంటి నిండా నిద్ర పట్టకుండా చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో శరీరానికి తగినంత విశ్రాంతి లభించదని అంటున్నారు. అంతేకాదు, శరీరంలో వాపు ప్రక్రియ ప్రేరేపితమై గుండె జబ్బు ముప్పు పెరిగేలా చేస్తుందట. నిద్ర భంగం, నిద్రలేమి సమస్యల వల్ల కుంగుబాటు వంటి మానసిక సమస్యలూ ముంచుకొస్తాయి. ఇవీ గుండెకు అంత మంచిది కాదట. రాత్రిపూట తగినంత నిద్రపోకపోతే తెల్లవారుజామున, ఉదయం పూట గుండె తీవ్ర ఒత్తిడికి లోనై సమస్యాత్మకంగా పరిణమిస్తుంది.కొంతమంది నిద్ర లేవగానే ఎక్సర్‌సైజ్ వంటి శ్రమతో కూడిన పనులు చేస్తుంటారు. మామూలుగా, ఉదయం పూట శరీరం విశ్రాంతి స్థితి నుంచి నెమ్మదిగా కోలుకుంటూ వస్తుంటుంది. ఇలాంటప్పుడు ఉన్నట్టుండి తీవ్రంగా శ్రమ చేసినట్టయితే గుండె మీద అదనపు భారం పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**ముప్పు కారకాలు ఇవీ :** డయాబెటిస్, హైబీపీ, మానసిక ఒత్తిడి, నెలసరి ఆగిపోవటం, స్లీప్ అప్నియా

ప్రశాంతంగా నిద్రపోయేలా చూసుకోవాలి. రాత్రివేళ 7-8 గంటల సేపు గాఢంగా నిద్రిస్తే హార్మోన్లు అస్తవ్యస్తం కావటాన్ని తగ్గించుకోవచ్చు. అలాగే, ఉదయం నిద్ర లేచాక ఓ గ్లాసు నీళ్లు తాగటం మంచిది. కెఫీన్‌తో కూడిన పానీయాలు అతిగా తీసుకోవద్దు. మంచం మీద నుంచి ఉన్నట్టుండి లేవొద్దు. కాసేపు కూర్చొవాలి. కాళ్లు, చేతులు, మెడ, నడుం కదిలించి, సాగదీయాలి

# ఎరుపు రంగు పాలకూరతో ఎన్నో లాభాలు..
## తరచూ తినాల్సిందే..!



మనకు అందుబాటులో ఉన్న అనేక రకాల ఆకుకూరల్లో పాలకూర కూడా ఒకటి. దీన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్న విషయం అందరికీ తెలిసిందే. పాలకూరను తింటే అనేక పోషకాలు కూడా లభిస్తాయి. అయితే పాలకూర పేరు చెప్పగానే ఆకుపచ్చ రంగులో ఉండే ఆకులే ఊహకు వస్తాయి. కానీ మీకు తెలుసా ? ఇందులోనూ అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో ఎర్ర పాలకూర కూడా ఒకటి. ఇది ముదురు ఊదా రంగులోనూ ఉంటుంది. మార్కెట్‌లో మనకు ఈ పాలకూర కూడా లభిస్తుంది. ఎరుపు రంగు పాలకూరలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. అందుకనే ఆ కూరకు ఎరుపు రంగు వస్తుంది. ఆకుపచ్చ రంగు పాలకూరలాగే ఎరుపు రంగు పాలకూర కూడా మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దీన్ని కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు అధికం..**

ఎరుపు రంగు పాలకూరలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇందులో బీటా సయనిన్స్, ఆంథో సయనిన్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఆకుపచ్చ పాలకూరలో ఉండవు. అందువల్ల ఎరుపు రంగు పాలకూరను తింటే యాంటీ ఆక్సిడెంట్లను అధిక మొత్తంలో పొందవచ్చు. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. వయస్సు మీద పడడం వల్ల వచ్చే వృద్ధాప్య చాయలు తగ్గుతాయి. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. దీంతో ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. ఈ పాలకూరను తింటే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

ఎరుపు రంగు పాలకూరలో నైట్రేట్స్ అధికంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారుతాయి. నైట్రిక్ ఆక్సైడ్ వల్ల రక్త నాళాలపై పడే ఒత్తిడి తగ్గి రక్త నాళాలు ప్రశాంతంగా మారుతాయి. రక్త నాళాలు వెడల్పు అవుతాయి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల గుండెపై పడే భారం తగ్గుతుంది. ముఖ్యంగా బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ పాలకూరను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హృదయ సంబంధిత వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఈ పాలకూరను తింటే శరీరంలోని కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా లభిస్తాయి. దీంతో నీరసం, అలసట తగ్గుతాయి. ఈ పాలకూరను తినడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి.

**శరీర శక్తి సామర్థ్యాలకు..**

రోజూ శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు ఎరుపు రంగు పాలకూర జ్యూస్‌ను తాగుతుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. దీని వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. దీంతో ఉత్సాహంగా మారుతారు. మళ్లీ యాక్టివ్‌గా పనిచేస్తారు. శరీర శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కండరాలు త్వరగా కోలుకుని శక్తిని పుంజుకుంటాయి. దీంతో మళ్లీ దృఢంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. ఎరుపు రంగు పాలకూరలో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ పాలకూర జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఇలా ఎరుపు రంగు పాలకూరతో అనేక లాభాలను పొందవచ్చు. కనుక దీన్ని తరచూ తినాలి.

# బ్రహ్మ ముహూర్తం.. భలే లాభం!



బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం మంచిదని ఇంట్లో పెద్దలు చెబుతారు. ఈ సమయంలో చదివితే బాగా గుర్తుంటుందని బడిలో టీచర్లూ చెబుతుంటారు. సూర్యోదయానికి గంటన్నర ముందు నుంచి 48 నిమిషాల సమయాన్ని బ్రహ్మ ముహూర్తంగా పేర్కొంటారు పెద్దలు. ఈ సమయంలో నిద్ర లేచినంత మాత్రాన అద్భుతాలు జరిగిపోవు. కానీ, ఈ వేళను సమర్థంగా వాడుకుంటే.. బోలెడన్ని ప్రయోజనాలు ఉన్నాయని నిపుణుల మాట. బ్రహ్మ ముహూర్తంలో నిద్ర లేవడం వల్ల పరిసరాల్లో ఎటువంటి అలజడి ఉండదు. చుట్టూ ప్రశాంతంగా ఉంటుంది. రోజు తేలికగా మొదలైందన్న భావన కలుగుతుంది. మానసిక, భౌతిక పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల మనసు చదువుపై కేంద్రీకృతం అవుతుంది.ఆయుర్వేద శాస్త్రాల ప్రకారం బ్రహ్మ ముహూర్తంలో లేవడం వల్ల వాత, పిత్త, కఫ దోషాలు తొలగిపోతాయి. దీన్ని అలవాటుగా మార్చుకుంటే జీర్ణక్రియలు సాఫీగా సాగుతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. రోగనిరోధక వ్యవస్థ అనేకరెట్లు బలపడుతుంది. బ్రహ్మ ముహూర్తంలోనే నిద్రలేచేవాళ్లు సూర్యోదయం తర్వాత ఆరుబయటికి వస్తారు. దీంతో ఉదయకాంతి శరీరంపై ప్రసరిస్తుంది. ఆహ్లాదకరమైన పరిసరాలను చూడటం వల్ల సెరటోనిన్ హార్మోన్ విడుదలవుతుంది. ఈ హార్మోన్ మానసికోల్లాసాన్ని పెంచుతుంది. చికాకు, బెంగ వంటి మానసిక భారాలను తగ్గిస్తుంది. ఆందోళన కూడా తగ్గుతుంది. త్వరగా నిద్ర లేవడం వల్ల తెల్లవారాక వాకింగ్, రన్నింగ్, జాగింగ్ చేయడానికి కావాల్సినంత సమయం ఉంటుంది. అలాగే రోడ్లు, పార్కులు, పరిసరాలు అనుకూలంగా ఉంటాయి. సూర్యోదయ సమయంలో వాహనాల రద్దీ ఉండదు. పరిశ్రమలు మూసి ఉంటాయి. గాలిలో ఆక్సిజన్ అధికంగా ఉంటుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెంచుకోవడానికి, దీర్ఘ శ్వాస సాధన చేసేవారికి ఇది అనుకూల సమయం. త్వరగా నిద్రలేవడం వల్ల వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుంది. కాబట్టి రోజువారీ పనులు ముందుగా మొదలుపెడతారు. అలాగే ముందుగానే పూర్తిచేస్తారు. కాబట్టి సక్సెస్ రేటు పెరుగుతుంది.

# తనదాకా వస్తే గానీ..



ఓ మహిళ ఒక రోజు గాంధీజీ వద్దకు వచ్చారట. గాంధీజీతో తన గోడు ఇట్లా వెళ్లబోసుకున్నారట. 'బాపూజీ.. నా కుమారుడు నిత్యం బెల్లం తింటున్నాడు. ఎంత చెప్పినా వినడం లేదు. మీరు చెప్తే వింటాడని మీ వద్దకు తీసుకొచ్చాను' అని ఆమె చెప్పారట. అయితే తనకు ఓ వారం రోజుల సమయం కావాలని ఆమెను గాంధీజీ అడిగారట. అంత వ్యవధి ఎందుకని గాంధీజీని తన అనుచరులు అడిగారట. వారం రోజుల తర్వాత ఆ బాలుడిని పిలిపించి బెల్లం తినొద్దని గాంధీజీ చెప్పి పంపించారట. తనకూ బెల్లం తినే అలవాటు ఉన్నది కాబట్టే, తాను మారిన తర్వాత గానీ ఇతరులకు నీతులు చెప్పొద్దనే ఉద్దేశంతోనే తాను మొదట ఆ బాలునికి దీని గురించి చెప్పలేదని గాంధీజీ తన అనుచరులకు చెప్పారట. అంటే తాను పాటించకుండా ఏ విషయం ఇతరులకు చెప్పొద్దని గాంధీజీనే చెప్పారు. ఇదంతా ఇప్పుడెందుకు అంటే మీడియా గొంతు నొక్కేస్తున్నారని గతంలో చెప్పిన మన ముఖ్యమంత్రి ఇప్పుడు అదే మీడియా విషయంలో, ప్రధానంగా జర్నలిస్టుల విషయంలో వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పేందుకే ఈ ఉపోద్ఘాతం. రాష్ట్ర ముఖ్యమంత్రి తాను విపక్షంలో ఉన్నప్పుడు మీడియా హక్కుల గురించి మాట్లాడారు. జర్నలిస్టులకు అండగా ఉంటానన్నారు. నాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని చెప్పిన ఆయన ఇప్పుడు తనను ప్రశ్నిస్తున్నవారిని అసలు జర్నలిస్టులే కాదంటున్నారు. అంతేకాదు, మీడియా మీట్‌లో ముందు వరుసలో కాలు మీద కాలేసుకొని కూర్చుని తమకు నమస్కారం పెట్టాలనే ధోరణిలో జర్నలిస్టులు ఉంటున్నారని ఎద్దేవా చేస్తూ, అలాంటివారి చెంప చెల్లుమనిపించాలన్నారు. అంతేకాదు, కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులుగా చెలామణి అవుతున్నారని కూడా ఫైరయ్యారు. 'అ ఆ'లు కూడా రానివారు తాము జర్నలిస్టులమ ని చెప్పుకొంటున్నారని సెలవిచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రభుత్వ పాలన గురించి సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని కొందరి చేత పనిగట్టుకుని దుష్ప్రచారం చేయించిన ఆయనకు నాటి మీడియా ఎంతో నచ్చింది. అప్పట్లో ఏ ఆధారాలు లేకుండానే బురదజల్లిన ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రస్తుత ముఖ్యమంత్రి సహా నాడు వాటిని ప్రసారం చేసిన జర్నలిస్టు సమూహాల గురించి ఆహా ఓహో అంటూ కొనియాడారు. కానీ, ప్రస్తుతం అధికారంలోకి రాగానే అవే వేళ్లు తన వైపునకు చూపేసరికి అసెంబ్లీ సాక్షిగా బట్టలూడదీసి జర్నలిస్టులను కొట్టాలంటున్నారు. తమ సమస్యలను చెప్పుకోవడానికి ఒక వేదికగా నిలిచే ప్రెస్ క్లబ్‌ను కల్లు కాంపౌండ్, పబ్బులతో పోల్చడం ముఖ్యమంత్రికే చెల్లింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భానికి ముందు కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తమ ఇష్టానుసారంగా మాట్లాడారు. అప్పుడు సంతో షపడిన ఇదే సీఎం, ఇప్పుడు కస్సుబుస్సులాడుతున్నారు. తన దాకా వస్తే ఇలా ఉంటుం దా? కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులు, మీలాంటి రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం పనిచేస్తే జర్నలిస్టు సమాజమంతా తప్పు చేసినట్టు మాట్లాడటం, చులకనభావంతో చూడ టం సరికాదు. జర్నలిస్టులు అనేవాళ్లను సమాజంలో చెడుగా చూపించే ప్రయత్నాన్ని మీరు పనిగట్టుకుని చేయడాన్ని జర్నలిస్టులు గాని, జర్నలిస్టు సంఘాలు గాని సహించవు. మన సీఎం మాత్రమే కాదు, ఆయన పాత మిత్రులు, ఆ మిత్రులకు తోడైన కొందరు కొత్త మిత్రులు.. అందరూ మీడియాపై విరుచుకు పడుతున్నవారే. ఎటొచ్చి జర్నలిస్టులే ఎటూ కాకుండాపోతున్నారు. రాహుల్‌గాంధీ నిత్యం ప్రజాస్వామ్యం గురించి, భావప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నారు. చేతిలో రాజ్యాం గం పుస్తకాన్ని పట్టుకొని తిరిగే ఆయనకు ఆ రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1)(ఏ) భావప్రకటనాస్వేచ్ఛ గురించి బాగా తెలుసు కాబట్టి, మీడియాకు స్వేచ్ఛ ఉండాలని కోరుకుంటున్నారు. తన గురించి ఎవ్వరు , ఏం మాట్లాడినా ఫర్వాలేదంటున్నారు. తనకు నచ్చిన విధంగా ముందుకెళ్తానని చెప్తున్నారు. కానీ, మన సీఎం మాత్రం, వాళ్ల అధినాయకుడి బాట కు భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఏడాదిన్నరలోనే తమను ప్రశ్నించిన జర్నలిస్టులపై ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో మన కండ్లముందున్నది. ఒక చెం ప కొడితే మరో చెంప చూపించాలనే గాంధీజీ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ పార్టీ ఏనాడో గాలికి వదిలేసింది. అయితే మన ముఖ్యమంత్రి గాంధేయ మార్గంలో నడుస్తున్నానని బయటకు చెప్తూనే అనేక చోట్ల ఆవేశంతో మాట్లాడే మాట లు యథావిధిగా మీడియా ప్రసారం చేస్తే మాత్రం సదరు ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొస్తుంది. పలు సభల్లో ఆయన మాట్లాడుతూ పేగులు మెడలో వేసుకుంటానని, బట్టలూడదీసి కొడతానన్నారు. ఆ మాటలను యథావిధిగా ప్రసారం చేస్తే జర్నలిస్టులపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వ పాలన జనరంజకంగా ఉంటే జర్నలిస్టులు అదే విషయాన్ని రాస్తారు. లేదు, ప్రజా కంఠకంగా పాలన సాగుతుంటే దానిని ప్రశ్నల రూపంలో సంధించి పాలకులకు తెలిసివచ్చేలా చేస్తుంటా రు. పాలకులనేవారు సద్విమర్శలను, సూచన రూపంలో వచ్చే వార్తలను అనుకూల దృక్పథంతో తీసుకోవాలి. అంతేకానీ, మీడియా సం స్థలు తమకు బాకా ఊదాలని, ఇంద్రుడు చం ద్రుడు అని పొగడాలని, తాము ఏం చేసినా ఏ నిర్ణయం తీసుకున్నా అదే సరైనదన్న రీతిలో వార్తలు కవర్ చేయాలని భావించడం పెద్ద తప్పు. తమ తప్పులను సరిచేసుకోకుండా మీడియాపైనా, జర్నలిస్టులపైనా విరుచుకుపడటం ఈ మధ్య ప్రతీ ఒక్కరికి ఫ్యాషన్‌గా మారింది. ఏ విభాగంలోనైనా ఒక్కరో, ఇద్దరో తప్పులు చేస్తుంటారు, అంతమాత్రాన మొత్తం ఆ విభాగానికే అంటగట్టడం, తక్కువ చేసి మాట్లాడటం ఏలికలకు తగదు. సమాజంలో గౌరవప్రదమైన వృత్తిగా భావించే జర్నలిజం, ఆ వృత్తిని ఆధారంగా చేసుకొని జీవిస్తున్న జర్నలిస్టులపై చులకనాభావం తగదు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు రాజకీయులు ప్రతిబంధకాలుగా మారడం మంచిది కాదు.

# ఆరు నెలల తర్వాత వందే భారత్ స్లీపర్ రైలును చూసి షాకయ్యా

## దేశీ ప్రయాణికురాలి వైరల్ వీడియోపై హాట్ డిబేట్




భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ స్లీపర్ రైలు ప్రయాణికుల నుండి విశేష ఆదరణ పొందుతూ వార్తల్లో నిలుస్తోంది. అయితే దేశీయ ప్రయాణికులే కాకుండా విదేశీ ప్రయాణికులు కూడా వందేభారత్ ట్రైన్ మీద ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవల కామాఖ్య-హౌరా మార్గంలో గౌహతి నుండి కోల్‌కతా వరకు నడిచే వందే భారత్ స్లీపర్ రైలు ప్రారంభమై ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా.. అంతర్జాతీయ ప్రయాణ నిపుణురాలు, ప్రముఖ కంటెంట్ క్రియేటర్ 'అనూష' పంచుకున్న సమీక్ష సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ప్రారంభోత్సవ సమయంలో ఉన్న హడావుడి, మెరుపులు ఆరు నెలల నిరంతర ప్రయాణాల తర్వాత కూడా నిలిచి ఉన్నాయా లేదా అని తెలుసుకోవడానికి ఆమె ఫస్ట్ ఏసీ క్యాబిన్‌లో ఒంటరిగా ప్రయాణించి, తన అనుభవాన్ని ఇన్‌స్టాగ్రామ్ వీడియో ద్వారా పంచుకున్నారు. సాధారణంగా భారతీయ రైళ్లలో నెలల తరబడి వేలాది మంది ప్రయాణించిన తర్వాత పరిశుభ్రత క్షీణించడం, సౌకర్యాలు దెబ్బతినడం చూస్తుంటామని, అందుకే ఈ రైలు కూడా అలాగే ధ్వంసమై లేదా గందరగోళంగా ఉంటుందని తాను ఊహించానని అనూష చెప్పారు. అయితే రైలులో అడుగుపెట్టిన వెంటనే ఆమె అంచనాలు పూర్తిగా తలకిందులయ్యాయి. ఆరు నెలల తర్వాత కూడా కోచ్‌లు, క్యాబిన్లు అత్యంత విశాలంగా, ఆధునికంగా, ఎటువంటి మచ్చలేని శుభ్రతతో కనిపించాయి. రైలు ఎక్కిన వెంటనే లభించిన వేడి టీతో పాటు.. మార్గమధ్యంలో వడ్డించిన ఆహారం తొలిరోజు ప్రయాణంలో ఉన్నంత రుచిగానే ఉందని ఆమె కొనియాడారు. రైలు నిర్వహణ స్థాయికి అసలైన నిదర్శనం దాని వాష్‌రూమ్ పరిస్థితేనని భావించిన అనూష.. ఫస్ట్ ఏసీలోని బాత్రూమ్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు. అందులోని షవర్ ఏరియా, బాత్రూమ్ ఎంతగానో పరిశుభ్రంగా ఉండటం చూసి ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వందే భారత్ స్లీపర్ రైలు ఆరు నెలల వైబ్ చెక్ లో సంపూర్ణంగా విజయం సాధించిందని ఆమె ప్రకటించిన వీడియోకు నెటిజన్ల నుండి లక్షలాది వీక్షణలు, వేలాది కామెంట్లు వచ్చాయి. ాశ్రీంశీ =ఘుం హైడ్రోజన్ రైలు ఐం వందే భారత్.. ఏది వేగం..మరేది చౌక.. ప్రయాణికులు తెలుసుకోవాల్సినవి ఇవే.. ఈ సమీక్ష వైరల్ అయిన తదుపరి రోజుల్లో.. ఖుఅంవ దీర్ఘుతీఫ్ స్లీపర్ రైళ్లకు సంబంధించి అనేక కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అనూష వీడియో ఆధారంగా సోషల్ మీడియా వేదికగా పౌర బాధ్యతపై ఒక పెద్ద చర్చ మొదలైంది. ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నప్పుడు.. వాటిని శుభ్రంగా ఉంచుకోవడం, ఆస్తిని కాపాడుకోవడం పౌరులుగా ప్రయాణికుల కనీస బాధ్యత అని నెటిజన్లు పెద్ద ఎత్తున వ్యాఖ్యానించారు. చెత్తను బాత్రూముల్లో లేదా కోచ్‌లలో పడేయకుండా డస్ట్‌బిన్‌లను వాడాలని ప్రచారాలు ఊపందుకున్నాయి. అదే సమయంలో ఈ రకమైన ప్రీమియం అనుభవాన్ని సుదీర్ఘకాలం కాపాడేందుకు రైల్వే శాఖ ఆన్-బోర్డ్ హౌస్‌కీపింగ్ సేవలను మరింత కఠినతరం చేసింది. రైలు ప్రయాణంలో ఉన్నంతసేపు ప్రతి రెండు నుండి మూడు గంటలకొకసారి వాష్‌రూమ్‌లను, కారిడార్లను శుభ్రం చేయడానికి ప్రత్యేక సిబ్బందిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా, కామాఖ్య-హౌరా మార్గంలో వందే భారత్ స్లీపర్ సాధించిన విజయవంతమైన స్పందనను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ.. రాత్రివేళ ప్రయాణ మార్గాలలో కూడా మరిన్ని వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టే తయారీ వేగాన్ని పెంచింది. ప్రయాణికుల భద్రత కోసం ప్రతి కోచ్‌లో ఆటోమేటిక్ డోర్లు, సీసీటీవీ కెమెరాలు, అత్యవసర టాక్-బ్యాక్ సిస్టమ్‌ల పనితీరును క్రమం తప్పకుండా తనిఖీ చేసేందుకు డిజిటల్ మానిటరింగ్‌ను ప్రవేశపెట్టారు. ఏదేమనా విదేశీ ప్రయాణికురాలి రివ్యూ భారతీయ రైల్వే మేక్ ఓవర్ పై అంతర్జాతీయంగా సానుకూల దృక్పథాన్ని పెంచడమే కాకుండా, దేశీయంగా రైలు సౌకర్యాలను కాపాడుకోవడంలో ప్రయాణికుల బాధ్యతను మరొకసారి గుర్తుచేసిందని చెప్పవచ్చు.

# ఏం కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు

## భారీగా పెరిగిన బియ్యం, చికెన్, కోడి గుడ్డు ధరలు



దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతోన్నాయి. కూరగాయల ధరలు, మాంస ధరలు, బియ్యం ధరలు పెరుగడంతో సామాన్యుడిపై భారం పడుతోంది. వంట నూనె ధరల కూడా భారీగానే పెరిగాయి. ఇక బియ్యం ధరలు కూడా భారీగా పెరిగాయి. తెలంగాణల భారీ వరి పండిస్తున్నప్పటికీ బియ్యం ధరలు పెరుగుతున్నాయి. గత రెండున్నర నెలల కాలంలోనే కేజీ సన్న బియ్యం ధర రూ.10 నుంచి రూ.12 వరకు పెరిగింది. నిత్యం వాడే సోనా మసూరీ, బిపిటి, ఐఆర్-64 వంటి రకాల క్వింటాల్ ధర మార్కెట్‌లో రూ.1,000 నుంచి రూ.1,500 వరకు పెరిగింది. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గుతుందనే ప్రచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ అక్రమ నిల్వలకు పాల్పడటం వల్లనే ఈ ధరలు పెరుగుతున్నట్లు చెబుతున్నారు. అయితే తెలంగాణల సన్న వడ్ల కంటే.. దొడ్డు వడ్లు ఎక్కు పండిస్తున్నారని.. కానీ తినేటప్పుడు సన్న బియ్యం తింటున్నారని చెబుతున్నారు. అందుకే సన్న బియ్యానికి డమాండ్ పెరిగిందని చెబుతున్నారు. బియ్యంతో పాటు చికెన్, కోడి గుడ్ల ధరలు కూడా భారీగానే పెరిగాయి. నెల క్రితం వరకు ఒక్కో కోడి గుడ్డు ధర రూ.6 ఉండేది. నెల రోజుల్లో కోడి గుడ్డు ధరరూ.8.50కు చేరడంతో పేద, గిరిజన కుటుంబాలు కొనుగోలు చేయడం తగ్గించారు. డజన్ గుడ్లు తీసుకునేవారు అరడజన్ తోనే సరిపెట్టుకుంటున్నారు. ఇక సండే వచ్చిందంటే.. చాలా మందికి ముక్క లేనిదే బుక్కు దిగదు. చాలా మంది సండే రాగానే చికెన్ కొనుగోలు చేస్తారు అయితే చికెన్ ధర భారీగా పెరిగింది. కిలో చికెన్ స్కిన్ లెస్ రూ. 360 నుంచి రూ.380 పలుకుతోంది. దీంతో కిలో చికెన్ తెచ్చుకునే వారు అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు. ఇక మటన్ ధర కిలో రూ.500 నుంచి రూ.1000 పలుకుంది. డబ్బున్నవారు తప్పా సామాన్యులు మటన కొనలేని స్థితికి చేరుకున్నారు. ఇక కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. టమాటా కేజీ రూ. 40 నుంచి రూ. 60 పలుకుతుండగా.. పచ్చిమిర్చి కిలో రూ. 40 నుంచి రూ. 60, ఉల్లిపాయలు కేజీ రూ. 40 నుంచి రూ. 55, బెండకాయ కేజీ 40 నుంచి రూ.50, వంకాయ కిలో రూ.40 నుంచి 50 పలుకుతోంది. క్యారెట్ కేజీ రూ. 50 నుంచి రూ. 60 పలుకుతుంది. వంట నూనెల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత ఆరు నెలల్లో సన్ ఫ్లవర్ ఆయిల్ ధర పెరిగింది. ప్రస్తుతం లీటర్ పొద్దుతిరుడు నూనె ధర రూ.160 నుంచి రూ.175 పలుకుతోంది. జూన్ లో కూడా ఆహార పదార్థాల ధరలు భారీగా ఉన్నాయి. అందుకే ఆహార ద్రవ్యోల్బణం పెరిగింది. దీనికి తోడు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. అలాగే ఎల్పీజీ సిలిండర్ల ధరలు కూడా పెరిగాయి. దీంతో సామాన్యుడు బతకలేని పరిస్థితి వచ్చింది. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# షాక్ మరోసారి భారీగా పెరగనున్న స్మార్ట్ ఫోన్ల ధరలు



స్మార్ట్ ఫోన్లు కొనేవారికి షాక్ తలగనుంది. స్మార్ట్ ఫోన్ల ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు కారణంగా గ్లోబల్ టెక్ కంపెనీలు ఇబ్బంది పడుతున్నాయి. అందుకే యాపిల్, శాంసంగ్ వంటి పలు కంపెనీలు స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ గతంలోనే ధరలను పెంచాయి. తాజాగా ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ చిప్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతోంది. ఒక వేళ చిప్ ధరలు పెరిగితే.. వచ్చే సంవత్సరంలో స్మార్ట్ ఫోన్లు, ల్యాప్ టాప్ ల ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. 6 ఎన్ఎం కంటే తక్కువ ఉండే చిప్‌లతో పాటు 28ఎన్ఎం, 16ఎన్ఎం, 12ఎన్ఎం చిప్‌లు ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఏఐకి డిమాండ్ పెరగడంతో మొబైల్ మెమొరీ విడిభాగాల ధరలు విపరీతంగా పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో కంపెనీలు ఫోన్ల ధరల్ని సగటున 15 శాతం మేర పెంచాల్సి వచ్చింది. ధరల పెంపు ప్రభావం సామాన్యులపై పడడంతో ఫోన్ల విక్రయాలు పడిపోయాయి. రూ. 15 వేల లోపు బడ్జెట్ ఫోన్ల విక్రయాలు 45 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. చైనీస్ బ్రాండ్ల మార్కెట్ వాటా 2020 తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు తెలుస్తోంది. మార్చిలో శాంసంగ్, వివో, ఐకూ కంపెనీలు ఫోన్ల ధరలను భారీగా పెంచాయి. చైనా కంపెనీలైన రెడ్ మీ, పోకో కూడా స్మార్ట్ ఫోన్ల ధరలను రూ.1000 నుంచి రూ.2,500 పెంచింది. వివో టీ4, ఐక్యూ జడ్ 10 సిరీస్ ఫోన్లపై గరిష్టంగా వేరియెంట్‌ను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.2,500 వరకు పెంచాయి. ఏఐ డేటా సెంటర్ల డిమాండ్, మెమొరీ చిప్‌ల కొరత వల్ల మొబైల్స్ తయారు చేసేందుకు కంపెనీలకు ఖర్చు పెరిగింది. దీంతో కంపెనీలు పెరిగిన ధరలను ఎండ్ యూసర్ కు పాస్ చేస్తున్నాయి. మార్చిలో శాంసంగ్ ఎఫ్ 17,ఏ 36, ఏ 56 మోడల్ స్మార్ట్ ఫోన్లపై రూ.2 వేల వరకు పెంచింది. ఇక పోకో సీ 75 మోడల్ ఫోన్‌పై రూ.2 వేలు పెంచింది. అందుకే స్మార్ట్ ఫోన్ల అమ్మకాలు పడిపోయాయి. ఈ నేపథ్యంలో కంపెనీలు తమ ఆలోచనలు మార్చుకుంటున్నాయి. మాస్ మార్కెట్‌ను ఆకట్టుకునేందుకు చాలా కంపెనీలు మళ్లీ 4+ స్మార్ట్ ఫోన్ పోర్ట్‌ఫోలియోపైకి దృష్టి పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు చిప్ ధరలు పెరుగుతాయన వార్తలు వస్తున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ల ధరలు కూడా భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది

## పైసలు పుట్టడమే కష్టమిక

## రాబర్ట్ కియోసాకి మరోసారి సంచలన హెచ్చరిక



ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుపోయి రికార్డు క్రియేట్ చేసిన ఆర్థిక పుస్తకం రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి.. తాజాగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రాబోయే రోజుల్లో ఎదుర్కోబోయే తీవ్రమైన ఆర్థిక మాంద్యం, పతనం గురించి తన హెచ్చరికను మరోసారి పునరుద్ఘాటించారు. మానవాళి చరిత్రలోనే అత్యంత భారీ ఆర్థిక సంక్షోభాలలో ఒకటి సంభవించబోతోందని తాజా ఞ (ట్విట్టర్) పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సంక్షోభ సమయంలో తీసుకునే నిర్ణయాలే ఒక వ్యక్తిని ధనవంతుడిగా లేదా పేదవాడిగా మారుస్తాయని తెలిపారు. తాను సంవత్సరాల క్రితమే రాసిన రిచ్ డాడ్స్ ప్రాఫసీ అనే పుస్తకంలో ఈ తరహా గ్లోబల్ ఆర్థిక పతనాన్ని ముందే ఊహించానని కియోసాకి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ పుస్తకంలోని మార్గదర్శకాలను పాటించిన పాఠకులు నేడు సురక్షితమైన, బలమైన ఆర్థిక స్థితిలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మాంద్యం ఇప్పటికే ప్రారంభమైందని తాను భావిస్తున్నప్పటికీ.. ఇన్వెస్టర్లు తమ వ్యూహాలను మార్చుకోవడానికి ఇంకా సమయం మించిపోలేదని చెప్పారు. ప్రతి ఆర్థిక సంక్షోభం అపారమైన నష్టాలతో పాటుగా.. తెలివిగా వ్యవహరించే కొద్దిమందికి సంపదను పునఃపంపిణీ చేసుకునే గొప్ప అవకాశాన్ని ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక మార్కెట్ పతనాన్ని తట్టుకోవడానికి, ఆర్థిక అనిశ్చితిని అధిగమించడానికి బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి ఆస్తులను కలిగి ఉండాలని కియోసాకి నిరంతరం సూచిస్తున్నారు. దిగ్గజ ఇన్వెస్టర్ జిమ్ రోజర్స్ అభిప్రాయంతో ఏకీభవిస్తూ.. బంగారం, వెండి ధరలు భవిష్యత్తులో ఆకాశాన్ని తాకుతాయని అంచనా వేశారు. ఇటీవల బంగారం ధర ఔన్సుకు 5,405 డాలర్ల నుండి 4,006 డాలర్లకు, వెండి 118 డాలర్ల నుండి 56 డాలర్లకు పడిపోవడం వంటి పరిణామాలను తాత్కాలిక మార్కెట్ దిద్దుబాట్లుగా ఆయన అభివర్ణించారు. సాధారణ స్పెక్యులేటర్లు ధరలు గరిష్టంలో ఉన్నప్పుడు కొని.. పడిపోయినప్పుడు అమ్మే పొరపాటు చేస్తారని, కానీ తాను మాత్రం ఈ క్రాష్ ను అవకాశంగా తీసుకుని మరిన్ని విలువైన లోహాలను కొనుగోలు చేస్తున్నానని వెల్లడించారు. ాశ్రీంశీ =ఘుం బంగారం, వెండి ధరలు ఆకాశానికి. మధ్యలో మాత్రం పాతాళానికి.. రాబర్ట్ కియోసాకి షాకింగ్ కామెంట్స్.. ప్రపంచ ఆర్థిక సవాళ్లను పరిష్కరించడంలో ప్రభుత్వాలకు. విధానకర్తలకు లేదా కేంద్ర బ్యాంకులకు తగిన సామర్థ్యం లేదని కియోసాకి తీవ్రంగా విమర్శించారు. నిజానికి పెరిగిన అప్పులు, ద్రవ్యోల్బణానికి వారే ప్రధాన కారణమని, అందుకే సాంప్రదాయ ఫియట్ కరెన్సీల కంటే భౌతిక ఆస్తులే నమ్మదగినవని ఆయన వాదించారు. ఎక్కువ ధరకు కొని తక్కువ ధరకు అమ్ముతారా? లేక తక్కువ ధరకు కొని ధనవంతులు అవుతారా అని ప్రశ్నిస్తూ.. సరైన సమయంలో సరైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. 1997లో వెలువడిన రిచ్ డాడ్ పూర్ డాడ్ ద్వారా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన రాబర్ట్ కియోసాకి.. కేవలం ఉద్యోగ ఆదాయంపై ఆధారపడకుండా రియల్ ఎస్టేట్, వ్యాపారాలు, కమొడిటీస్ వైపు దృష్టి సారించాలని పదేపదే చెబుతుంటారు. సాంప్రదాయ పొదుపరులు మాంద్యం సమయంలో అత్యంత ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన పదేపదే హెచ్చరిస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది.

# భారీ స్థాయిలో వంట నూనెల దిగుమతి

## ధరలు పెరుగుతాయా



భారతదేశంలో క్రూడ్ ఆయిల్ తో పాటు వంట నూనెలు కూడా భారీగానే దిగుమతి చేసుకుంటుంది. క్రూడ్ ఆయిల్ ఇండియాలో దొరకడం కష్టం కాబట్టి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. కానీ.. వంట నూనెలు మన దేశంలోనే పండించుకోవచ్చు. కానీ. దేశ అవసరాలకు సరిపడ నూనె గింజలను పండించడం లేదు. భారత్ ఎక్కువగా పామాయిల్ దిగుమతి చేసుకుంటుంది. అయితే ఇక్కడే పామాయిల్ పండిస్తే.. బాగుంటుందని చెబుతున్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా భారత్ భారీ స్థాయిలో వంట నూనెల దిగుమతి ప్లాన్ చేస్తోంది. రాబోయే పండుగ సీజన్ దృష్టిలో ఉంచుకుని వంట నూనెల కొరత లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం, దేశీయ రిఫైనరీలు చర్యలు తీసుకుంటున్నాయి. జూలై నుంచి అక్టోబర్ వరకు నెలకు 15 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి చేసుకోవడానికి ప్లాన్ చేశాయి. వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగలకు పిండి వంటలు, స్వీట్లు ఎక్కువ చేస్తారు. వీటికి భారీ స్థాయిలో నూనె అవసరం పడుతుంది. అందుకే వంట నూనెల కొరత లేకుండా ఉండేందుకు భారీ ఎత్తున వంట నూనెలు దిగుమతి చేసుకోనున్నారు. ప్రస్తుతం దేశంలో సోయాబీన్, ఆవాల క్రషింగ్ తగ్గడంతో నూనెల లభ్యత తగ్గింది. ఈ లోటును భర్తీ చేయడానికి పండుగల నాటి గరిష్ఠ డిమాండ్‌ను తట్టుకోవడానికి దిగుమతులే ఏకైక మార్గంగా మారాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వి.మెహతా చెప్పారు. దేశీయ రిఫైనర్లు పామ్ ఆయిల్, సోయా ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు పెంచుకుంటున్నాయి. ఇండియా ప్రధానంగా ఇండోనేషియా, మలేషియాల నుంచి భారీ ముడి పామాయిల్ నూనెను దిగుమతి చేసుకుంటుంది. అర్జెంటీనా, బ్రెజిల్‌ల నుంచి సోయా నూనె, రష్యా-ఉక్రెయిన్‌ల నుంచి పొద్దుతిరుగుడు నూనె దిగుమతులు చేసుకుంటుంది. భారత్ నుంచి పెద్దమొత్తంలో ఆర్డర్లు రావడంతో ఇండోనేషియా, మలేషియాల్లో నిల్వలు తగ్గి మలేషియన్ పామ్ ఆయిల్, గ్లోబల్ సోయా ఆయిల్ ఫ్యూచర్స్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్నాయి. ఇండియా మొత్తం వంటనూనెల అవసరాలలో దాదాపు 55-60 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతుంది. అయితే గత కొద్ది రోజులుగా వంట నూనెల ధరలు క్రమంగా పెరుగుతోన్నాయి. రూ.110 ఉన్న సన్ ఫ్లవర్ ఆయిల్ ధర ప్రస్తుతం రూ.160 చేరింది. భవిష్యత్ లో దిగుమతులను తగ్గించుకోవడానికి నేషనల్ ఎడిబుల్ ఆయిల్ మిషన్ లో భాగంగా నూనె గింజల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# హైడ్రోజన్ రైలు ఫెయిలవుతోందా

## సమోసా ధర కన్నా తక్కువలో చార్జీలు

## అధునాతన సౌకర్యాలున్నా కనిపించని ప్రయాణికులు



పర్యావరణ రక్షణ దిశగా భారతీయ రైల్వే చారిత్రాత్మక ముందడుగు వేసింది, ఇందులో భాగంగానే దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైలును హర్యానాలోని జింద్, సోనిపత్ మార్గంలో అందుబాటులోకి తీసుకువచ్చింది. పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రారంభించిన ఈ రైలులో ఛార్జీలు కూడా చాలా తక్కువే. ప్రయాణికులకు జింద్ నుండి సోనిపత్ వరకు కనీస ఛార్జీ రూ. 5 కాగా, గరిష్ట ఛార్జీ రూ. 25 మాత్రమే కావడం విశేషం. వందే భారత్, అమృత్ భారత్ తరహాలోనే ఆధునిక సదుపాయాలతో కూడిన ఈ రైలు, సాంప్రదాయ డీజిల్ రైళ్లలాగా కాలుష్యాన్ని వెదజల్లకుండా కేవలం నీటి ఆవిరిని మాత్రమే ఉద్గారంగా విడుదల చేస్తుంది. అయితే అత్యంత చౌకైన ఛార్జీలు, అత్యాధునిక సౌకర్యాలు ఉన్నప్పటికీ.. ప్రారంభ రోజుల్లో ఈ రైలులో ప్రయాణికుల సంఖ్య అనుకున్న స్థాయిలో నమోదు కాలేదు. మొదటి రోజు జింద్ జంక్షన్ నుండి సుమారు 20 మంది ప్రయాణికులు మాత్రమే ప్రయాణించగా. రెండవ రోజు కూడా దాదాపు అదే తరహా స్పందన లభించింది. ఈ తక్కువ ఆక్యుపెన్సీకి ప్రధాన కారణం జింద్-సోనిపత్ మార్గంలో ఇప్పటికే అనేక ఇతర ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులో ఉండడమేనని చెప్పవచ్చు. కొత్త రైలు సమయాలు, దాని ప్రత్యేకతలు, ప్రయాణ ప్రయోజనాలపై ప్రయాణికులకు ఇంకా పూర్తిస్థాయి అవగాహన కలుగకపోవడం కూడా ఈ ప్రారంభ నిరాశకు దోహదం చేసింది. సమయం గడిచేకొద్దీ, విస్తృత ప్రచారం లభించే కొద్దీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. సాంకేతికంగా ఈ హైడ్రోజన్ రైలు అత్యాధునిక ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. దీనిలో హైడ్రోజన్, గాలిలోని ఆక్సిజన్ కలయిక ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రైలు మోటార్లను నడుపుతారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైలులో మెట్రో తరహా ఆటోమేటిక్ డోర్లు, డిజిటల్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లేలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ వంటి సౌకర్యాలను అమర్చారు. మొత్తం 10 కోచ్‌లు కలిగిన ఈ రైలు ఒకేసారి సుమారు 2,600 మంది ప్రయాణికులను మోసుకెళ్లే సామర్థ్యాన్ని కలిగి ఉంది. హైడ్రోజన్ రైలు ఐం వందే భారత్.. ఏది వేగం .మరేది చౌక. ప్రయాణికులు తెలుసుకోవాల్సినవి ఇవే.. భారతీయ రైల్వే చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక పైలట్ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 111.83 కోట్లు వెచ్చించారు. జింద్ నుండి సోనిపత్ మధ్య ఉన్న 89 కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు కవర్ చేస్తుంది. ఈ హైడ్రోజన్ ట్రైన్ కోచ్‌లను తమిళనాడులోని చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో డిజైన్ చేసి తయారు చేశారు. ఇందులో ఉపయోగించిన ఫ్యూయల్ సెల్ సిస్టమ్‌ను ప్రత్యేకంగా భారతీయ వాతావరణం, ఉష్ణోగ్రతలకు అనుగుణంగా రూపొందించారు. రైలుకు అవసరమైన ఇంధనం కోసం జింద్ వద్ద ప్రత్యేకంగా ఒక హైడ్రోజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ నీటి నుండి హైడ్రోజన్‌ను వేరు చేసి, కంప్రెస్డ్ రూపంలో రైలులోని సిలిండర్లలోకి నింపుతారు. ఒకసారి ఇంధనం నింపితే ఈ రైలు సుమారు 1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణించేలా ప్రణాళిక రూపొందించారు.ఒక సాధారణ డీజిల్ రైలు ఏడాదికి వందల టన్నుల కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తుంది. అయితే ఈ హైడ్రోజన్ రైలు ద్వారా సంవత్సరానికి సుమారు 1,200 టన్నుల కార్బన్ ఉద్గారాలను నివారించవచ్చని రైల్వే శాఖ అంచనా వేసింది. జింద్-సోనిపత్ మార్గంలో అందుతున్న ఫలితాలు.. ప్రయాణికుల స్పందన ఆధారంగా రాబోయే రోజుల్లో డార్జిలింగ్ హిమాలయన్ రైల్వే, నీలగిరి మౌంటైన్ రైల్వే, కల్కా-సిమ్లా వంటి పర్యాటక, కొండ ప్రాంతాలలో కూడా మొత్తం 35 హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టాలని భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. స్థానిక ప్రయాణికులకు ఈ కొత్త వేళలపై అవగాహన కల్పించేందుకు. రైల్వే స్టేషన్లలో డిజిటల్ బోర్డుల ద్వారా ప్రచారం నిర్వహించేందుకు రైల్వే అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రైల్వే శాఖ ప్రయాణికుల భద్రత, ట్రాక్ నిర్వహణ, ఆధునీకరణ పనుల్లో భాగంగా ఒక కీలక ప్రకటనను విడుదల చేసింది. జూలై 27 నుండి జూలై 29 వరకు పలు మార్గాల్లో నడిచే అనేక రైళ్లను రద్దు చేయడంతో పాటు.ొన్ని ప్రధాన రైళ్ల మార్గాలను మళ్లిస్తున్నట్లు తెలిపింది. కాబట్టి ప్రయాణికులు తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకునే ముందు రైల్వే అధికారిక యాప్ లేదా స్టేషన్ ఎంక్వైరీ కౌంటర్లలో రద్దయిన, మళ్లించిన రైళ్ల జాబితాను ఒకసారి తనిఖీ చేసుకోవాలని సూచించింది.



# గేటెడ్ కమ్యూనిటీలో లవ్

ఒక గేటెడ్ కమ్యూనిటీలో జరిగే రొమాంటిక్ థ్రిల్లర్ కథతో రూపొందిన చిత్రం 'అదే నీవు అదే నేను'. కొండల్ దర్శకత్వంలో గోవిందు కాండ్రేగుల నిర్మించారు. 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో రెండు విభాగాల్లో అవార్డులు సాధించిన 'కమిటీ కుర్రోళ్లు'లో నటించిన త్రినాథ్ వర్మ, యశ్వంత్ పెండ్యాల, 'సిద్ధార్థ్ రాయ్' సినిమా ఫేమ్ తన్వీ నేగి, సహర్ కృష్ణన్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 31న విడుదల చేయనున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. "మంచి రొమాంటిక్ థ్రిల్లర్ కథాంశంతో కొండల్ తెరకెక్కించిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది" అని నిర్మాత పేర్కొన్నారు.

# తెలంగాణ గ్రామీణ కథ

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న యాక్షన్ డ్రామా 'మారెమ్మ'. ఈ సినిమా ద్వారా రవితేజ సోదరుడి తనయుడు.. మాధవ్ హీరోగా పరిచయమవుతున్నాడు. మంచాల నాగరాజ్ దర్శకుడు. సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. +వశీస్త్రతీఝజూప్తఱఎ =వటవతీవఅఎవ ఇందులో మాధవ్ యాక్షన్‌మోడ్‌లో కనిపిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ బలమైన భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యాక్షన్ ఘట్టాలు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. దీపా బాలు, వినోద్‌కుమార్, వికాస్ వశిష్ట తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రశాంత్ ఆర్ విహారి, నిర్మాత: మయూర్ రెడ్డి, దర్శకత్వం: మంచాల నాగరాజ్.



# ముచ్చటగా మూడోసారి?





అగ్ర కథానాయిక పూజాహెగ్డే తెలుగులో పూర్వవైభవం కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నది. ప్రస్తుతం తెలుగులో దుల్కర్‌సల్మాన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నదీ భామ. శర్వానంద్ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో ఆమెనే కథానాయిక అని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పూజాహెగ్డే టాలీవుడ్‌లో మరో భారీ ఆఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. అగ్ర హీరో అల్లు అర్జున్‌తో ఈ సొగసరి ముచ్చటగా మూడోసారి జోడీకట్టబోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం అల్లు అర్జున్ సైన్స్ ఫిక్షన్ 'రాకా'లో నటిస్తున్నారు. అట్లీ దర్శకుడు. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో బన్నీ సినిమా కన్‌ఫర్మ్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఫిల్మ్‌నగర్ టాక్. గతంలో అల్లు అర్జున్-పూజాహెగ్డే జోడీ 'డీజే' 'అల వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో కలిసి నటించారు.

# చెన్నైతో ఉన్న అనుబంధం గుర్తుకొచ్చింది



'ఈ సినిమా టైటిల్ వినగానే నేనొక్కసారిగా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోయాను. చెన్నైతో నాకున్న అనుబంధం, ప్రేమ గుర్తుకొచ్చింది. నిజంగా ఈ టైటిల్‌లో ఏదో మ్యాజిక్ ఉంది. నన్ను స్ఫూర్తిగా తీసుకొని అభిమానులు ప్రయోజకులు అయితే అంతకుమించిన ఆనందం ఉండదు. ఈరోజు వేదిక మీద అందరూ నా అభిమానులు ఉండటం సంతోషంగా ఉంది' అన్నారు మెగాస్టార్ చిరంజీవి. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'చెన్నై లవ్‌స్టోరీ' చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. ఎస్‌కేఎన్, సాయిరాజేష్ నిర్మాతలు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాత ఎస్‌కేఎన్ నా అభిమానిగా హైదరాబాద్‌కు వచ్చి.. సినిమాల మీద ప్రేమతో నిర్మాతగా ఎదిగారు. ఇక సాయిరాజేష్ మంచి సినిమాలు తీయడమే కాకుండా నేషనల్ అవార్డ్ పొందడం ఆనందంగా ఉంది. నిజంగా ఇలాంటి అభిమానుల్ని చూసి గర్విస్తున్నా. కిరణ్ అబ్బవరం మన పక్కింటి అబ్బాయిలా ఉంటాడు. నాలుగైదు సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు' అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'చిరంజీవి అన్నది పేరు కాదు. అది నాకో ఎమోషన్. ఈ వేదికలో ఆయన ముందునిల్చొని మాట్లాడటం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నేను పోషించిన స్టీవెన్ అనే పాత్ర నా వ్యక్తిగత జీవితానికి కూడా బాగా కనెక్ట్ అయింది' అని చెప్పారు. తన కెరీర్‌లోనే బెస్ట్ పాత్రను పోషించానని కథానాయిక శ్రీగౌరీప్రియ ఆనందం వ్యక్తం చేసింది

# కల్యాణ్‌రామ్ కొత్త సినిమా



ప్రస్తుతం వెంకటేష్‌తో కలిసి ఓ మల్టీస్టారర్ సినిమాలో నటిస్తున్నారు కల్యాణ్‌రామ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటున్నది. ఇదిలావుండగా కల్యాణ్‌రామ్ మరో సినిమాకు ఓకే చెప్పారని తెలిసింది. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు తెరకెక్కించబోతున్న ఈ చిత్రానికి పరశు రామ్ దర్శకత్వం వహిస్తారని సమాచారం. 'ఫ్యామిలీ స్టార్' పరాజయంతో దర్శకుడు పరశురామ్ కెరీర్‌కు కాస్త బ్రేకిచ్చారు. తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఓ యూనిక్ పాయింట్‌తో కథను సిద్ధం చేశారని తెలిసింది. దీనిని కల్యాణ్‌రామ్‌కి వినిపించగా ఆయన సానుకూలంగా స్పందించారని ఫిల్మ్‌నగర్ టాక్ వినిపిస్తున్నది. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com